# BALA CHELIMI

# BALA




# December

# DEC 2024

₹40

డిసెంబర్ - 2024

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

## BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 34 • సంచిక : 3




DECEMBER - 2024

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

Oxford
Grammar High School

OGS JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE





# We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

# బాలచెలిమి


పిల్లల వికాస పత్రిక


# BALA CHELIMI


Telugu Children's Monthly Magazine

సంపుటి: Volume: **34** | సంచిక : Issue : **3** | హైదరాబాద్ Hyderabad | డిసెంబర్ December | పేజీలు Pages **52** | రూ. ₹. **40**


## లోపలి పేజీల్లో.......










| | | |
|---|---|---|
| మీ ఆరోగ్యమే దేశ భవిష్యత్‌కి భరోసా...... | మణికొండ వేదకుమార్ | 5 |
| విద్యుత్తేజం థామస్ అల్వా ఎడిసన్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| శిఖరం (పర్వత దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| బాలల కాంక్ష (కవిత) | కీర్తి | 8 |
| రూపా సింగ్ | షీరోస్-256 | 9 |
| తికమక పెట్టే అక్షరాలు (అక్షరం) | వై. మల్లికార్జున రావు | 10 |
| బంగారు బాలసాహిత్యం | నారంశెట్టి ఉమామహేశ్వర్ రావు | 10 |
| మంచి నిర్ణయం (కథ) | కన్నెగంటి అనసూయ | 11 |
| అబద్ధాల రాయుడు (కథ) | లియో టాల్ స్టాయ్ | 13 |
| కోతి కొమ్మచ్చి (ఆట) | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 14 |
| 'మాయాలోకం', 'ఏంజెల్' నవలా రచయిత పి. చంద్రశేఖర్ అజాద్..... . | శ్రీ గరిపల్లి అశోక్ | 15 |
| కథా రచయితగా జగదీశ్ చంద్రబోస్ (సైన్స్ వెన్నెల-2) | డా నాగసూరి వేణుగోపాల్ | 18 |
| తెలంగాణ - పర్యాటక స్థావరాలు - 1 (యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| అమెరికాలో పిల్లలకు గ్రంథాలయాలు ఎలా అలవాటు చేస్తారు | మంచికంటి | 20 |
| వివాహాల్లో వింత పోకడలు (కథ) | యం. రాం ప్రదీప్ | 21 |
| క్రిస్మస్ చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 23 |
| రెండు హంసలు - తాబేలు కథ | పంచతంత్ర కథ | 24 |
| నీరు (పంచభూతాలు) | బెలగాం భీమేశ్వరరావు | 24 |
| మార్గశిర మాసం (నెలలు) | 'బాల కథా సౌరభం' | 25 |
| ఎర్రజెండా (కార్టూన్) | వినూత్న | 26 |
| ఉర్విల్ పటేల్ - బూమ్రా - గుకేష్ .. (స్పోర్ట్స్) | సచిన్ కోత్వాల్ | 27 |

చీమ - చందమామ (కథ)........ అనిల్ బత్తుల ........ 29
మాయ అద్దం (కథ)........ డా. కె.బి. గోపాలం ........ 32
బాలనర్తకి (సైన్స్)........ డాక్టర్ మహీధర నళినీ మోహన్........ 35
చెలిమి క్లబ్........ బాలచెలిమి ........ 36
బాలచెలిమి పిల్లల వికాస పత్రిక (రివ్యూ)........ డా. నాగరసూరి వేణుగోపాల్........ 36
ప్రేమకు ప్రతిరూపం క్రిస్టమస్ పర్వదినం (పండుగ)........ డా. అమ్మిన శ్రీనివాసరాజు ........ 37
కంగారు ........ (జంతువు) ........ 39
మంచి ఆహారపు అలవాట్లు (ఆరోగ్యం - విజ్ఞానం)........ బాల సారస్వతం (ఆరోగ్యం-విజ్ఞానం)40
కథ చెప్పుకుందామా! (కథ)........ డాక్టర్ ఉప్పల పద్మ ........ 41
నేర్చుకుందామా ........ ........ 44
బాలలం - పూవులం ........ (ఆడుతూ పాడుకుందాం)........ 45
కాళ్ళాగజ్జా కంకాళమ్మా ........ (ఆడుతూ పాడుకుందాం)........ 45
పర్యావరణం & జీవవైవిధ్యం (జి.కె.)........ సచిన్ కోత్వాల్........ 46
వైభవంగా బాలల సాంస్కృతికోత్సవం... (చిల్డ్రన్స్ డే)........ తెలంగాణ సారస్వత పరిషత్........ 47
సమాచారం........ బాలచెలిమి డెస్క్ ........ 48
చుక్క సత్తయ్య (వ్యక్తిత్వం)........ డాII కె. చెన్నయ్య........ 50


# చెలిమి లేఖలు

నాకు కథలు, గేయాలు అంటే చాలా ఇష్టం. బాలచెలిమి పత్రిక వారు ప్రచురించిన పర్యావరణ పిల్లల కథలు పుస్తకం లో నేను వ్రాసిన "మారిన జనం" అనే కథ ఎంపికైనది. వేదకుమార్ సర్ బహుమతిగా పుస్తకాలు పంపించారు. ఈ కథ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్-2023 దక్కన్‌ల్యాండ్ మాసపత్రికలో ప్రచురిత మవడం నా జీవితంలో మరిచిపోలేని రోజు. భవిష్యత్తులో గొప్ప రచయిత్రి కావాలన్నదే నా ఆశయం.

**- పల్లె వైష్ణవి**

పదవ తరగతి, జక్కాపూర్ ఉన్నత పాఠశాల, సిద్దిపేట

మాకు కవితలు, కథలు చదవడం, రాయడం అంటే ఇష్టం. మా ఉపాధ్యాయులు శ్రీ గండుపల్లి గోవిందయ్య గారు కథలు రాయడం నేర్పారు. మా పాఠశాలలో IFB పానల్ బోర్డులో కనెక్ట్ చేసి ఆ పత్రికలోని బాలసాహిత్యం చదివిస్తారు. మేము బాలచెలిమి మాస పత్రిక గురించి విన్నాము.

**- లీలావతి & జ్యోత్స్న**

9వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్, ఎర్రవారిపాలెం, తిరుపతి

నేను పుసులూరి సాక్షి చౌదరి బాల చెలిమి పుస్తకంలోని "కుందేలు మరియు సింహం" అనే కథను చదివాను అందులో నేను "బుద్ధి బలం ఉపయోగించి ఎంతటి ప్రమాదాల నుంచి మనల్ని మనం రక్షించుకోవాలి. దేహబలం కన్నా బుద్ధిబలం మిన్న" అనే నీతిని నేను ఈ పుస్తకంలోని కథ ద్వారా నేను నేర్చుకున్నాను.

**- పుసులూరి సాక్షిచౌదరి**

9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జల్లేపల్లి, ఖమ్మం.

*Cover Picture*
***Divith Reddy Adulla***
*Under-8 World Cadets Chess Championship 2024*





బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్
m : 98495 43728

**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# మీ ఆరోగ్యమే దేశ భవిష్యత్‌కి భరోసా

ఆరోగ్యమే మహాభాగ్యం. ఈ మాట వినీ వినీ విసుగొస్తుంది కదా అందరికీ. కానీ ఈ మాట చిన్న వాక్యం కాదు. ఇది ఒక జీవన పరమార్థం. సంపదే మహాభాగ్యమన్న భ్రమలో మనం పెరుగుతున్నాం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ.) నిర్వచనం ప్రకారం ఏ జబ్బూ లేకపోవడమే ఆరోగ్యం కాదు. శారీరక దృఢత్వం, మానసిక వికాసం, సామాజిక దృక్పథం బాగుంటేనే పరిపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇప్పుడు చెప్పండి మనం ఆరోగ్యంగా ఉన్నామా!

ఎర్లీ మార్నింగ్ ట్యూషన్, ఆదరాబాదర బ్రేక్‌ఫాస్ట్, ఎనిమిదింటికి స్కూలు, సాయంత్రం ట్యూషన్, అలసిపోయి ఇంటికి రావడం, ఏదో నోట్లో కుక్కుకుని హోం వర్క్. ఇక ఆటలేవి? పాటలేవి? స్నేహితులతో కబుర్లేవి? కడుపు నిండా తిండేది? కలలు కనే నిద్రేది? మీ బాల్యం మీది కాకుండా పోతుంది గమనించారా?



మరి మీ బాల్యం మీకు దక్కాలంటే, మీరు ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చెయ్యాలి? ముందు సరైన పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి. బ్రేక్‌ఫాస్ట్ అస్సలు మిస్సవకూడదు. మరీ చిన్న పిల్లవైతే ప్రతి రెండు గంటలకీ ఆరోగ్యకరమైన స్నాక్స్, లంచ్ తీసుకోవాలి. స్కూలు బయట అమ్మే చిరుతిళ్లు, చాక్లెట్స్, చిప్స్, ఐస్‌క్రీమ్స్ తినకూడదు. మీ స్నాక్స్ అమ్మనడిగి ఇంటి దగ్గర నుంచే తెచ్చుకోవాలి. సాయంత్రం సూర్యరశ్మి తగిలేలా ఆటలాడుకోవాలి. చదువుల ఒత్తిడితో మానసికంగా అలసిపోవటం కాక వ్యాయామంతో, ఆటలతో శరీరం అలసిపోవాలి. గోరువెచ్చటి నీటితో స్నానం చేసి ఎర్లీగా తిని, ఎర్లీగా నిద్రపోవాలి. మంచి ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం కావాలి. ఈర్ష్య, అసూయలకు దూరంగా ఉండాలి, తోటి పిల్లలతో స్నేహంగా ఉండాలి. కలివిడిగా ఉండాలి. మీకు తెలిసినవి ఇతరులతో పంచుకోవాలి. మీరు తెలుసుకోవాలి. పాఠ్యేతర పుస్తకాలు, కథలు, సైన్సు పుస్తకాలు చదవాలి. చర్చించుకోవాలి. దీనివల్ల మానసిక వికాసంతో పాటు సృజనాత్మక సామర్థ్యాలు, సానుకూల సామాజిక ప్రవర్తన అలవడతాయి. ఇవి ఆనందంగానూ, ఉత్తేజంగా ఉంచుతాయి.


శారీరక ధారుఢ్యం, మానసిక వికాసం, సామాజిక ప్రవర్తనల సమాహారమే నిజమైన ఆరోగ్యం. మీరు ఆరోగ్యంగా ఉంటేనే దేశ భవిష్యత్తు ఆరోగ్యంగా ఉంటుంది.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి





# విద్యుత్తేజం థామస్ అల్వా ఎడిసన్

మానవజాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్‌లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన గొప్ప సైంటిస్టు థామస్ అల్వా ఎడిసన్. ఇవాళ మన ఇంటిలో చీకట్లను తరిమి వెలుగులు విరజిమ్ము తున్నాయంటే దానికి కారణం ఎడిసన్. 1000 పేటెంట్లకు హక్కులు కలిగి ఉన్న ప్రతిభాశాలి. ఎడిసన్ 1847లో అమెరికాలో జన్మించాడు. శామ్యూల్, నాన్సీలు ఈయన తల్లిదండ్రులు. ఎడిసన్ చిన్నతనంలో బడికి వెళ్లింది తక్కువే. తన తల్లి ద్వారా చదవడం, రాయడం, గణితాన్ని నేర్చుకున్నాడు. తెలుసుకోవడం, నేర్చుకోవడం పట్ల ఆసక్తి ఎక్కువ. 13 సంవత్సరాల వయస్సులోనే న్యూస్‌బోయ్‌గా ఉద్యోగం చేసాడు. ఖాళీ సమయాలను శాస్త్రీయ, సాంకేతిక పుస్తకాలను చదవడానికి ఉపయోగించుకున్నాడు. స్వయంగా చదవడం ద్వారా చాలా నేర్చుకున్నాడు. స్వీయ అభివృద్ధిపై తనకున్న నమ్మకం జీవితమంతా అలాగే ఉంది. ఎడిసన్ ప్రయోగశాలలతో పాటు కర్మాగారాలు నిర్మించిన పారిశ్రామిక వేత్త. వ్యాపారవేత్త. ఎడిసన్ జీవితంలో విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువ. బల్బును కనిపెట్టడానికి కనీసం మూడువేల సార్లు విఫలమైనట్లు తానే చెప్పారు. విజయాలను సాధించడానికి పది శాతం ప్రేరణ ఉంటే 90 శాతం కఠోరమైన శ్రమ ఉండాలి. షార్ట్‌కట్ విజయాలు సుదీర్ఘకాలం నిలబడవు. ప్రతి వైఫల్యం తనకి ఎంతో స్ఫూర్తిని, ప్రేరణను ఇచ్చి విజయం సాధించాలనే కసిని పెంచిందని 1890లో హార్పర్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. వైఫల్యం పొందిన వ్యక్తికే విజయంలోని గొప్పదనం, సాధించడంలోని కష్టం అర్థమవుతుందన్నారు. విజయాలు సాధించడానికి వ్యూహాత్మక ఆలోచనా విధానాలు అవసరమని, ఎప్పటికప్పుడు ఏ పని ఎలా ఉందో, ఎలా చేస్తున్నారో విశ్లేషించుకుంటూ ఉండాలని, ఆలోచనని, కృషిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలని ఎడిసన్ చెప్పారు. ఇవన్నీ అర్థం చేసుకుంటే థామస్ అల్వా ఎడిసన్‌లా మీరు కూడా విజయాలను సాధిస్తారు.

– జుగాష్‌విలి
బాలచెలిమి, m : 9848266384

# శిఖరం




పిల్లలూ మీకు విహారయాత్రలంటే ఇష్టమేనా! విహారయాత్రలలో భాగంగా ట్రెకింగ్ (పర్వతారోహణ)కు వెళ్తుంటారా. మీ అందరికి ఇప్పుడు ఒక ప్రశ్న? ప్రపంచంలో ఎత్తైన పర్వతశిఖరం ఎవరెస్ట్ ఎక్కడ ఉందో తెలుసా. అది మన భారతదేశంలోని హిమాలయాలలో ఉంది. దాని ఎత్తు సుమారు 8,849 మీటర్లు. దానిని మొదటి సారిగా 1953లో న్యూజిలాండ్‌కి చెందిన పర్వతారోహకుడు ఎడ్మండ్ హిల్లరీ, నేపాల్‌కు చెందిన పర్వతారోహకుడు టెన్సింగ్ నార్కే అధిరోహించారు.

పర్వతాలు ప్రపంచ భూభాగంలో ఐదవవంతుని ఆక్రమిస్తున్నాయి. పర్వతాల అధ్యయనాన్ని ఓరాలజీ (orology) అంటారు. సముద్ర మట్టం నుండి 900 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉండేదాన్ని కొండ అని, 900 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉండేదాన్ని పర్వతం అని పిలుస్తారు. భూమి కింద ఉన్న పలకలు అంటే టెక్టోనిక్ ప్లేట్లు ఒకదానికొకటి కొట్టుకున్నప్పుడు పర్వతాలు ఏర్పడతాయి. పర్వతాలను ఎక్కడానికి ప్రత్యేకమైన శిక్షణ అవసరం. చాలా ధైర్యసాహసాలతో కూడినది. ప్రపంచవ్యాప్తంగా ఏడు ఎత్తైన శిఖరాలు ఉన్నాయి. పర్వతారోహణను ఇష్టపడేవారు 'సెవెన్ సమ్మిట్' లను ఛాలెంజ్‌గా తీసుకొని ఎక్కుతారు. అలా 'సెవెన్ సమ్మిట్' ఛాలెంజ్‌ని పూర్తి చేసింది మీలాంటి ఒక విద్యార్థిని. తెలంగాణలోని నిజామాబాద్ బాలిక 'మలావత్ పూర్ణ' 14 సంవత్సరాల వయస్సులో అంటే 2014లో ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కింది. అంతే కాదు వరుసగా 2016లో మౌంట్ కిలిమంజారోని(ఆఫ్రికా), 2017లో మౌంట్ ఎల్ బ్రస్(యూరప్), 2019లో మౌంట్ అకోన్ కగువా(దక్షిణ అమెరికా), మౌంట్ కార్టెన్జ్ (ఓషియానియా), మౌంట్ విన్ సన్(అంటార్కిటికా)లను, 2022లో మౌంట్ డెనాలి(ఉత్తర అమెరికా) లను అధిరోహించి ధైర్యానికి హద్దులు లేవని నిరూపించింది. పూర్ణ జీవితం ఆధారంగా సినిమా కూడా వచ్చింది.

కొన్ని వందల ఏళ్లుగా పర్వతాలు అనేక జీవ జాతులకు నిలయంగా ఉన్నాయి. పర్వతాలపై వాతావరణ పరిస్థితులు వ్యవసాయానికి, ఉద్యానవన పంటలకు, పశువుల పెంపకానికి అవకాశాలను కల్పించాయి. 80 శాతం మంచినీరు పర్వత ప్రాంతాల నుండే లభిస్తుంది. ఎత్తైన పర్వతశిఖరాలపై నుండి చూస్తే ప్రకృతి ఎంతో అందంగా కనబడుతుంది. అందులోను మంచుతో కప్పబడే హిమాలయలను చూడడానికి రెండు కళ్లు చాలవు. మహాకవి కాళిదాసు కుమారసంభవం లోను, అల్లసాని పెద్దన మనుచరిత్రలోను హిమాలయాలను వర్ణించారు. కాని వాతావరణ

మార్పులు, మారుతున్న వ్యవసాయ పద్ధతులు, మైనింగ్ పేరిట విధ్వంసాలు, జంతువుల అక్రమరవాణా కోసం సాగించే వేట వల్ల పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడుతోంది. దాని ఫలితమే ఈ ప్రకృతి విపత్తులు. పర్వతాలు భౌగోళిక వారసత్వ సంపద. అవి ఒకసారి నాశనం చేయబడితే ఎప్పటికీ పెరగవు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్వతాలను, ఆ ప్రాంతాలలో ఉన్న జీవవైవిధ్యాన్ని, అందమైన ప్రకృతిని కాపాడడానికి ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ పర్వతదినోత్సవాన్ని (International mountain day) ఏర్పాటు చేసింది. 2003 డిసెంబర్ 11న మొదటిసారి అంతర్జాతీయ పర్వత దినోత్సవాన్ని జరుపుకున్నారు. అప్పటి నుండి ఏదో ఒక థీమ్‌తో పర్వతాలను సంరక్షించే చర్యలను చేపడుతున్నారు. 2024లో స్థిరమైన భవిష్యత్తు కోసం పర్వత పరిష్కారాలు, ఆవిష్కరణ, అనుసరణ మరియు యువత (mountain solutions for a sustainable future - innovation, adaptation and youth) అనే థీమ్‌తో ముందుకు వస్తున్నారు.

అనేక స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రకృతి ప్రేమికులు కూడా పర్వతాలను, కొండలను. గుట్టలను సంరక్షించే అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. అలాంటిదే society to save Rocks. దక్కన్ ల్యాండ్, బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ గారు కూడా పర్యావరణానికి హాని చేసే చర్యల నివారణకు అనేక రకాలుగా తమ గళాన్ని వినిపిస్తున్నారు. పర్యాటకం పేర కొండవాలులో హెూటల్, రిసార్టుల నిర్మాణం వంటివి కొండప్రాంతాల సహజత్వాన్ని దెబ్బతీస్తున్నాయని, నేచురల్ లాండ్ స్కేప్‌ను కాపాడుకోవాలని వేదకుమార్ గారు అంటున్నారు.

"It's not the mountain, we conquer, but ourselves".

– డా.నీరజ అమరవాది
m : 9849160055

కవిత

# బాలల కాంక్ష

తెలుగు పాట పాడుతాం
వెలుగు బాట సాగుతాం
కలిసిమెలిసి మేమంతా
చెలిమి విలువ చాటుతాం

మాట మీద నిలబడుతాం
తోటలాగ కనబడుతాం
కోటలో యువ రాజులై
మేటిగా జీవిస్తాం!

హరివిల్లై ఉదయిస్తాం
విరిజల్లై కురుస్తాం
సిరిమల్లె పువ్వుల్లా
చిరునవ్వులు చిందిస్తాం



కోతలన్నీ మానుతాం
చేతల్లో చూపిస్తాం
పొరుగు వారికి సాయపడి
పరువు కల్గి బ్రతుతాం

– గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580

# రూపా సింగ్

భారత దేశపు మొదటి మహిళా జాకీగా గొప్ప కీర్తిని పొందారు. భారతదేశపు మొట్టమొదటి మహిళా జాకీగా పరిగణించబడ్డ రూపా కున్వర్ సింగ్ ప్రయాణం ఒకే రకమయిన పద్ధతులను అధిగమించడం, అడ్డంకులను జయించడం మరియు పురుషుల ఆధిపత్య నియంత్రణలో విశేషంగా ఎత్తులకు ఎదగడం వంటి స్ఫూర్తిదాయకమైన కథ.




నాలుగేళ్ళ వయసులో రూపా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆమె తాత ఉగం సింగ్ రాథోడ్ బ్రిటీష్ ఆర్మీ ఆఫ్ ఇండియాలో గౌరవనీయమైన అశ్వ శిక్షణ బోధకుడై ఉన్నారు. ఆమె తన తండ్రి, జాకీ అయిన సర్పత్ సింగ్ రాథోడ్ నుండి గుర్రపు స్వారీ మరియు నియంత్రణలో అత్యుత్తమ అంశాలను నేర్చుకుంది. ఆమె శారీరకంగా డిమాండ్ చేసే కార్యకలాపాల నుండి మహిళలను నిరుత్సాహపరిచే సామాజిక అంచనాలకు వ్యతిరేకంగా క్రీడలోకి ప్రవేశించింది. జాకీయింగ్‌కు అనవసరమైన శారీరక బలం మహిళలకు లేదని నమ్మినందున రూపా అనుమానం మరియు పక్షపాతాన్ని ఎదుర్కొంది. ఆమె వివక్షకు గురైంది మరియు పోటీ కోసం ఉత్తమమైన గుర్రాలు అందుబాటులో లేకపోయినా, ఆమె తన అభిరుచిని కొనసాగించడంలో ఎంతో పట్టుదలను చూపింది. రూపా కున్వర్ సింగ్ యొక్క సంకల్పం, అణచి వేయబడని స్ఫూర్తితో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 700 కంటే ఎక్కువ రేసులను గెలుచుకోవడంతో అద్భుతమైన విజయాన్ని సాధించింది. ఆమె ప్రయాణం పట్టుదల, అభిరుచి యొక్క శక్తికి స్పష్టమైన నిదర్శనం. ప్రారంభంలో అడ్డంకులు, పక్షపాతం ఉన్నప్పటికీ, రూపా తనదైన రంగంలో విజయం సాధించింది, ఒకే రకమైనటు వంటి (మూస) పద్ధతులను సవాలు చేస్తూ, జాకీయింగ్ ప్రపంచంలో మహిళల నూతన శకానికి నాంది పలికింది. జాకీగా, సింగ్ 540 కిలోల బరువున్న మరియు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తే గుర్రాలను నియంత్రించి, స్వారీ చేయాల్సి వచ్చింది.

– 'షీరోస్–256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా'

నుండి....

అక్షరం

# తికమక పెట్టే అక్షరాలు



ఒక అక్షరాన్ని హడావిడిగా రాసినప్పుడో, పరధ్యానంలో రాసినప్పుడో అది మరో అక్షరం లాగానో, అర్థరహితమైన అక్షరంగానో మారిపోవడం సాధారణం. అటువంటి అక్షరాలు, గుణింతాలు, ఒత్తులను పరికించి సవరించుకోవాలి.

స? స? గు? స గు

సరు నగు సగు

‘స’ ను రెండు గీతల్లో.... కుడివైపు గీత ఎత్తుగా రాయాలి. ‘గు’ ను మూడు గీతల్లో రాయాలి. అదే విధంగా....ఈ క్రింది జతల్లోని ప్రతి అక్షరాన్ని ఒక దానిలా మరొకటి ఉండకుండా అభ్యసించండి.

చ ఛ ఉ డ ఘ ష అ ఱ

అ ఆ స న ప వ ఒ బ శ ళ

– వై. మల్లికార్జున రావు
డైరెక్టర్, మహా అకాడెమి, m : 9966961642

## బంగారు బాల సాహిత్యం

బాలసాహిత్యమంటే ఒకప్పుడు పిల్లల కోసం పెద్దలు రాసేవారు. అయితే ప్రస్తుతం గొప్ప మార్పు కనబడుతోంది. తమకు నచ్చిన భాషలో, నచ్చిన అంశాన్ని ఎంచుకుని పిల్లలే రచనలు చేస్తున్నారు. ఒకేసారి తెలంగాణ రాష్ట్రంలో 5 లక్షల మంది విద్యార్థులు రాసిన కథల్లో ఎంపిక చేసిన 1016 కథలతో 33 పుస్తకాలు ప్రచురితమయ్యాయి. అవి కాకుండా పిల్లలు రాసిన సాహిత్యం చాలా వచ్చింది. తెలంగాణ సారస్వత పరిషత్, బాలచెలిమి వేదకుమార్, శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి సౌజన్యంతో గరిపల్లి అశోక్ మున్నగువారు పిల్లల రచనలకు ప్రాముఖ్యతనిస్తూ సాహితీ యజ్ఞాన్ని కొనసాగిస్తున్నారు.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు
m : 94907 99203

కథ

# మంచి నిర్ణయం



తీరికగా చెట్టుపై కూర్చుని ఆహ్లాదాన్ని అనుభవిస్తూ చుట్టూ పరిశీలనగా చూడసాగింది కాకి.

అలా చూడగా చూడగా కింద ఏదో జరజరా పాకుతున్నట్టు అనిపించి కిందకు చూసింది.

దానిని చూడగానే కాకికి ఎప్పుడూ లేనిది భయం వేసింది. కింద కొమ్మ మీదకు దూకి మరింత పరిశీలనగా చూసింది.

అది పాములా పొడుగ్గా ఉంది. కానీ సున్నగా లేదు. దాని ఒళ్లంతా బరకగా ఉన్న ఒకలాంటి పొట్టు కలిగి ఉంది.

అదే పనిగా పరికించి చూసిన కాకికి అదేదో వింత జాతిలా అనిపించింది. పైగా అది చాల నెమ్మదిగా వెళుతూంది.

"ఇలాంటి ప్రాణిని ఈ అడవిలో ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు. పైగా చూడటానికి భయం కలుగుతూంది. ఎక్కడి నుండి వచ్చిందో. ఈ విషయం అందరికీ చెప్పెయ్యాలి" అనుకుని రయ్యున కిందకు వెళ్ళి దాని తోక భాగం వైపు ఆగి దాని కూడా అడుగులు వేస్తూ "కావ్.. కావ్ "అని గట్టిగా అరిచింది.

ఆ అరుపులు విన్న ఆ అడవిలోని పాములూ, పక్షులూ, జంతువులూ అన్నీ హడావిడిగా అక్కడికి చేరుకున్నాయి.

కాకి వాళ్లందరికీ ఆ ప్రాణిని చూపించి.."ఇప్పటి వరకూ మనం అందరం కలిసిమెలిసి ఉన్నాం. ఎలాంటి గొడవలూ మన మధ్య లేవు. మనం అందరం ఎప్పుడూ కలుస్తూనే ఉంటాం. కానీ ఇటువంటి ప్రాణిని మాత్రం మనం మన అడవిలో మునుపెన్నడూ చూడలేదు. మీరు ఎవరైనా చూశారా?" అని అడిగింది.

అందరూ చూడనట్టు తలూపారు ఆ ప్రాణినే చూస్తూ.

"ఎక్కడి నుండి వచ్చిందో? ఎలాంటిదో మనకు తెలియదు. కొత్త వాళ్లని మనం గమనించకపోతే మనకే ప్రమాదం. అందుకే మీ అందర్నీ పిలిచాను." అంది కాకి ఒక్క గెంతుతో దాని దగ్గరకంటా వెళుతూ.

"మంచి పని చేసావు. నువ్వు చెప్పినది నిజం" అంది భయంగా కుందేలు.

"ఎవరు నువ్వు? ఎక్కడికి వెళుతున్నావు? మాతో చెప్పు." అంది చురుకుగా ఉండే నక్క దాని ముఖం దగ్గరకంటా వెళ్ళి.

దాంతో ఆ ప్రాణి పాకటం ఆపి తల తిప్పి ఒక్కసారి నక్కకేసి చూసి మరలా ముందుకు వెళ్ళిపోసాగింది.

ఇదంతా అక్కడే ఉండి గమనిస్తున్న పులి..

"సరే! దానిని వెళ్లనివ్వండి. మనం కూడా వెళదాం. అప్పుడైనా తెలుస్తుంది కదా. అది ఎవరో" అనేసరికి

"సరే.. సరే "అంటూ అన్నీ దానినే అనుసరించసాగాయి.

అలా కొంత దూరం వెళ్ళాకా ఒకచోట ఆగింది ఆ

ప్రాణి. ఆ వెనుకే మిగతావన్నీ కొంచెం వెనుకగా ఆగాయి.

"ఇక్కడ ఎందుకు ఆగిందబ్బా..?" అనుకుంటూ చుట్టూ చూశాయి అవన్నీ. వాటికి అక్కడ ఒక చిన్న మట్టి గుట్ట కనపడింది. ఆ గుట్ట దగ్గరకంటా వెళ్ళిన ఆ పొడవైన ప్రాణి ఒక్కసారిగా తన ఒంటిని గట్టిగా ఊపింది. దాంతో దాని వంటిని అంటుకున్న మట్టి అంతా ఆ గుట్ట దగ్గర పడింది. దానిని చూస్తూనే ఆశ్చర్యపోయాయి మిగతా ప్రాణులన్నీ. ముఖాముఖాలు చూసుకున్నాయి నవ్వుకుంటూ.

అందర్లో భయం పోగా.. దాని దగ్గరకంటా వెళ్ళి.. "నువ్వా. నువ్వేంటి ఇలాగ? ఈ మట్టి ఏంటి?" అని అడిగాయి.

ఆ మాటలకి ఆ పాము గట్టిగా నవ్వి.. "మీ మాటలు వింటూ ఎంత నవ్వుకున్నానో నాలో నేను. నా ఒళ్లంతా మట్టి ఉండటంతో మీరు గుర్తుపట్టలేదు నన్ను" అంది మరోసారి తన ఒంటిని దులుపుతూ.

"అవును. మేమెవరమూ నిన్ను గుర్తుపట్టలేదు. అయినా ఈ మట్టంతా ఏమిటి. ఎక్కడైనా మట్టిలో కూరుకుపోయావా?" అని అడిగింది తోడేలు.

"లేదు లేదు. కావాలనే నా ఒళ్లంతా మట్టి పూసుకుని తెచ్చుకున్నాను" అంది పాము దగ్గర్లో ఇసుకలో దొర్లుతూ.

"ఎందుకు మట్టి నీకు?" అనడిగాయి ఆశ్చర్యపోతూ.

"ఎందుకా? పుట్ట కట్టుకుందామని.."

"పుట్టా? నువ్వెందుకు కట్టుకోవటం? చీమలు కట్టుకున్న పుట్టలోకి దూరిపోతారు కదా మీరంతా చీమల్ని తరిమేసి" అంది ఏనుగు పామునే చూస్తూ.

"అవును. ఇప్పటి వరకూ అలాగే జరిగింది. కానీ ఇక నుంచీ అలా జరగదు."

ఆ మాటలకి చాల బాధపడింది అక్కడే ఉన్న మరో పాము. "ఎందుకని?" అని అడిగింది ఉండబట్టలేక.

"ఎందుకా? వాళ్ళు కష్టపడి కట్టుకున్న పుట్ట మనకెందుకు? మనం కట్టుకోలేమా ఏమిటి? నేను మొన్న దారితప్పి మన అడవిని ఆనుకుని ఉన్న గ్రామంలోకి వెళ్ళిపోయాను. ఆకాశంలో గ్రద్దను చూసి ప్రాణభయంతో దగ్గరలో ఉన్న ఇంట్లో దూరాను.

అక్కడ తెలిసింది ఇలా ఇంకొకళ్ళు కట్టుకున్న ఇంటిని ఆక్రమించటం తప్పు అని. ఆ పనులు మనుష్యులు చేస్తున్నారు.

మనం చెయ్యకూడదు. అది మన అడవికి, మా జాతికి అవమానం. అందుకని నా పుట్ట నేనే కట్టుకుందామని ఇలా మట్టి తెచ్చుకుంటున్నాను. అదిగో చూడండి. పుట్టకి సరిపడా మట్టిని తెచ్చాను" అంది పాము.

"మిత్రమా.. నీ ఉద్దేశ్యం మంచిదే. కానీ ఇలా కాదు. మనం లోపలికంటా వెళ్ళి మనం ఉండేంత ఖాళీ చేసుకుని అక్కడి నుండి మట్టి పైకి తెచ్చుకోవాలి. "అంది అక్కడే ఉన్న చీమ.

"అవునా? అది నాకు తెలియదు కదా" అంది పాము సిగ్గుపడుతూ. అది గమనించిన తాబేలు..

"సిగ్గుపడకు. మీకు అలవాటు లేదు కదా ఇలా కట్టుకోవటం. అయినా నువ్వు చేసిన పని చిన్నది ఏమీ కాదు. ప్రాణాలకు తెగించి మట్టిని తెచ్చుకున్నావు. కాకి మా అందరినీ పిలిచింది కాబట్టి సరిపోయింది. లేదంటే ప్రమాదం జరిగేది" అంది.

ఇంతలో సింహం పాము దగ్గరకంతా వెళ్ళి..

"మన ఇంటిని మనమే కట్టుకోవాలన్న ఆలోచన నాకు నచ్చింది. నువ్వు మా అడవిలో ఉన్నందుకు గర్వంగా ఉంది" అని పాముని తట్టి అభినందించి అక్కడే ఉన్న చీమలను దగ్గరకు రమ్మని పిలిచి... వాళ్లతో..

"ఇది గొప్ప ఆలోచన. ఎవరి ఇంటిని వాళ్లే కట్టుకోవాలి. ఇంకొకరు కట్టుకున్నదానిని ఆక్రమించటం తప్పు. తమ తప్పు తాము తెలుసుకోవటం మరింత గొప్ప విషయం. గొప్ప పనికి మనమూ సహకరించాలి. కాబట్టి ఆ ఇల్లు నిర్మించుకోవటం ఎలాగో ఆ పాముకి మీరంతా దగ్గరుండి నేర్పండి" అని ఆజ్ఞాపించింది సింహం.

"మేమూ సహకరిస్తాం. మేమూ సాయం చేస్తాం" అంటూ చప్పట్లు చరుస్తూ అక్కడున్న పాములూ, పక్షులూ, జంతువులూ అన్నీ పాము చుట్టూ తిరగసాగాయి.

వాటి కేరింతలతో అడవి అంతా దద్దరిల్లిపోయింది. చెట్లూ ఊగుతూ వాటికి వంత పాడాయి.

– కన్నెగంటి అనసూయ

m : 9246541249



కథ



# అబద్ధాల రాయుడు



కుర్రవాడు ఒకడు గొర్రెలు కాస్తూ, తోడేలును చూసినట్టుగా, “తోడేలు, తోడేలు! రండి! బాబోయ్, రండి!” అని కేక వేశాడు. చుట్టుపక్కల ఉన్న మనుషులు అక్కడికి పరిగెత్తుకుని వచ్చి చూశారు. తోడేలూ లేదు, ఏమీ లేదు. ఆ కుర్రవాడు ఇలా రెండు మూడు సార్లు చేశాడు.



తరవాత నిజంగానే తోడేలు అక్కడికి వచ్చింది. “రండి, త్వరగా రండి! తోడేలు, తోడేలు!” అంటూ కుర్రవాడు అరిచాడు. ఎప్పటిలాగానే ఈసారి కూడా కుర్రవాడు మోసం చేస్తున్నాడని చుట్టుపక్కల మనుషులు అతడి మాటలను పట్టించుకోలేదు. తోడేలు వచ్చి గొర్రెలను చంపేసింది.

**లియో టాల్ స్టాయ్**
**బాలల కథలు నుండి**

ఆట

# కోతి కొమ్మచ్చి



ఎంతమంది పాల్గొనవచ్చు -
ఇద్దరు నుంచి ఎందరైనా ఆడవచ్చు

ఎక్కడ ఆడవచ్చు - చెట్లు ఉన్న ప్రాంతంలలో

ఈ ఆటకు గల ఇతర పేర్లు - కాలి క్రింద కర్రాట

'కోతి కొమ్మచ్చి' ఆటలో ముందుగా ఒకరిని దొంగగా ఎన్నుకుంటారు. జట్టులోని మేటి ఆటగాడొకరు చెట్టు కింద లేక సమీపంలోని ఒక వృత్తం (గిరి అంటారు) మధ్యలో ఎడమ కాలి మీద నిలబడి, కుడికాలు మోకాలి వరకు పైకెత్తి, ఆ కాలి కిందుగా కుడిచేత్తో ఒక మూరడు పొడుగున్న కర్రని విసరగలిగినంత దూరం విసరగానే, అతని ఎదురుగా నిలబడిన దొంగగా పిలవబడే ఆటగాడు పరుగున వెళ్ళి ఆ కర్రను తెచ్చి గిరిలో పెట్టాలి. ఈలోగా కర్ర విసిరిన వాడూ చెట్టెక్కేస్తాడు. ఇప్పుడు చెట్టు మీదున్న వాళ్లలో ఎవ్వరైనా ఒకరు దొంగకు దొరక్కుండా గిరిలోని కర్రను తాకగలిగితే దొంగ మళ్లీ దొంగావతారం ఎత్తాలి. ఎవరూ కర్రను తాకక మునుపే ఎవరైనా దొంగకు దొరికితే (చెట్టు మీదయినా కిందయినా) ఆ ఆటగాడు దొంగవుతాడు. మాజీదొంగ కర్ర విసరాలి. దొంగ కర్రకు కాపలాగా గిరిలోనే ఉండిపోకుండా ఎవరినైనా దొరకబుచ్చుకొనే ప్రయత్నంలో ఉండాలి.



ప్రయోజనం : ఈ ఆట ద్వారా ఆటగాళ్లు శారీరకంగా చాలా చలాకీగా తయారు అవుతారు. పూర్తిగా ఆటలో మునిగి ఆడతారు కావున, మానసికంగా కూడా బలంగా అవుతారు. సామూహికంగా ఆడతారు. కాబట్టి, స్నేహ వాతావరణము అలవడతుంది.

– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...

# 'మాయాలోకం', 'ఏంజెల్' నవలా రచయిత పి. చంద్రశేఖర్ అజాద్‌తో ముఖాముఖి




**ప్రశ్న : మీ నేపథ్యం, బాల్యం, విద్యాభ్యాసం గురించి చెప్పండి?**

జవాబు: నేను 1955 మే 24న గుంటూరు జిల్లా, వెల్లటూరులో పుట్టాను. మా అమ్మ పమిడిముక్కల విజయలక్ష్మి, తండ్రి లక్ష్మణరావు. అయితే నా బాల్యం, విద్యాభ్యాసం అంతా రేపల్లెలో జరిగింది. అక్కడ ఇంటర్ మీడియట్ పూర్తి చేశాక చదివే అవకాశం లేక హోటల్ కార్మికుడిగా వెళ్లిపోయాను.

**ప్రశ్న: రచనా జీవితంలోకి అడుగు పెట్టటానికి ప్రేరణ - స్ఫూర్తి - మీరు ఎలాంటి జీవితాన్ని అనుభవించారు?**




జవాబు: 1962లో నాకు 7 సంవత్సరాల వయసులో నాన్న చనిపోయారు. అంతకుముందు ఆస్తులు అమ్ముకొని, తెలంగాణా పోరాట సమయంలో ఆరు సంవత్సరాలు కడవాలు జైలులో ఉన్నారు. వేం మొత్తం అయిదుగురు పిల్లలం. ఇద్దరు అక్కలు, ఓ అన్న, తమ్ముడు. అప్పటికి మరణం అంటే తెలియదు. నాన్న తిరిగి క్రీస్తులా తిరిగి రాగలడని ఓ చిన్న అనుభవం ద్వారా ఎదురు చూసేవాడిని. తర్వాత మా మైదానంలో అక్కడున్న ప్రజల్లో నాన్నను వెతుక్కున్నాను. అది తర్వాత కాలంలో 'మనోప్రస్థానం' వలసగా రూపుదిద్దుకుంది.

నాన్న మరణం తర్వాత మూడు దశాబ్దాలకు పైగా పేదరికం నన్ను నడిపించింది. మా అమ్మ అనంతమైన త్యాగం, ప్రేమ, ఆమెలోని గొప్ప సహనం మమ్మల్ని తీర్చిదిద్దాయి. ఆమె చదువుకుంది మూడో తరగతి. ఓ కోర్టులో నాలుగు మాటలు రాయటానికి ఆమె పడ్డ శ్రమ చూశాను. అందుకే నా ప్రతి అక్షరం లోనూ అమ్మ ఉంటుంది.

**బాల్యంలో ప్రేరణ**

మాది పెద్ద మైదానం. అక్కడ అన్ని వర్గాల, వర్ణాల ప్రజలున్నారు. నా జీవితపు గని అది. ఆరు దశాబ్దాల క్రితం అక్కడి జీవితం, అక్కడి ప్రజలు - అక్కడి ప్రకృతి నన్ను రచయితగా మార్చాయి. అన్ని అనుభవాలు ఉన్నాయి. అయిదో తరగతి నుండి నాకు రచనలు చేయాలనిపించేది. మా గ్రంథాలయంలో పుస్తకాలు చదవటం ఆరంభం అయ్యాక నాలో ఊహలు రెక్కలు తొడిగాయి. ఎలా రాయాలో తెలియదు. పత్రికలకు ఎలా పంపాలో తెలియదు. అలా పడుతూ, లేస్తూ ముందుకు వెళ్లాను. నాకు జీవితానుభవం తప్ప భాషా పటిమ లేదు. ఇప్పటికీ వాడుక భాషలో రాస్తుంటాను.

మా మైదానంలో అన్ని మతాల వారు వొడ్డెరవారు, మధ్య తరగతి, భూస్వాములు, రైతులు, కార్మికులు, అన్ని వృత్తుల వారుండేవారు. అప్పట్లో పెద్ద సంఘర్షణలు లేవు. అందరి కోసం అందరూ ఉండేవారు. ఆర్థికంగా సహకరించే పరిస్థితి కాదు. కానీ వారి ప్రేమ, సానుభూతి, మంచి మాటలు చాలు. ఇవన్నీ ప్రేరణలే. నాకు చదువుకునే అవకాశాలు లేవు కాబట్టి చిన్నతనంలోనే నేను కలాన్ని నమ్ముకున్నాను.

**బాలసాహిత్యం దిశగా తొలి అడుగులు**

మా కాలేజీ సావెనీర్లు 1971లో మొదటిసారి కథ అచ్చయింది. తర్వాత రచయితగా చాలా తిరస్కరణలు.

'అపరాధ పరిశోధన' పత్రికలో రచనలు నాకు గుర్తింపు తెచ్చాయి. అప్పుడే బాలసాహిత్యంలో 'బాలజ్యోతి' పత్రిక వారు నవలల పోటీ పెట్టారు. 'అందమైన పూలతోట' అనే నవలకు నాకు మొదటి బహుమతి వచ్చింది. 42 సంవత్సరాలు అయింది. అది తెలుగు బాల సాహిత్యంలో అప్పటికీ ఇప్పటికీ ప్రయోగాత్మక రచన. తర్వాత 'మా హృదయం' అనే ప్రయోగాత్మక రచనను వేమూరి బలరామ్‌గారు స్వాతి మాసపత్రికలో సీరియల్‌గా ప్రకటించారు. దాంతో నేను 'పిల్లలకు అంకితం', 'అమ్మానాన్న' ఆ తర్వాత 'జమీందారు కోట' ఆంధ్రప్రభ డెయిలీలో ప్రచురించారు. 'దేవతా ఓ దేవతా' నవలను ఆంధ్రప్రభ వార పత్రికలో వాకాటి పాండురంగారావు గారు 'నాటి బాలలకు, నేటి బాలలకు' అని సీరియల్‌గా ప్రకటించారు. ఇవన్నీ పాఠకులను, విమర్శకులను ఆకర్షించాయి. తర్వాత పిల్లల నవలలకు ప్రోత్సాహం లేదు. తిరిగి 2010 నుండి కేంద్ర సాహిత్య అకాడమీ వారు పిల్లల సాహిత్యానికి అవార్డులు ఇవ్వటం. తానా మంచి పుస్తకం వారు పోటీల వల్ల తిరిగి రాయటం మొదలు పెట్టాను. 'దారితప్పిన పిల్లవాడు', పిల్లల పుస్తకం 'ఆట', 'మాయాలోకం', 'ఏంజెల్' మరో రచన పిల్లల కోసం రాశాను.



**ప్రశ్న : ఎన్ని నవలలు, కథలు రాశారు?**

జవాబు : నేను పిల్లలతో ఆగలేదు. పెద్దల కోసం, యువతరం కోసం రాశాను. ఇప్పటికి 87 నవలలు, 18 నవలికలు, 850 కథలు, 17 ఫీచర్స్ – రేడియో, టీవికి 5000 ఎపిసోడ్స్, సినిమా, టెలీఫిల్మ్స్, కవిత్వం వ్యాసాలు ఇలా కొన్ని వేల పేజీలు రాశాను.

31 నవలలకు, 100 పైగా కథలకు బహుమతులు వచ్చాయి. రెండు నంది అవార్డులు ఉత్తమ సంభాషణలు, స్క్రీన్‌ప్లేకి వచ్చాయి. తెలుగు యూనివర్సిటీ వారు కీర్తి పురస్కారం. కథ – నవలకు ప్రతిభ పురస్కారం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పురస్కారం, కళారత్న (హంస) అవార్డ్, అధికార భాషా సాంస్కృతిక అవార్డు వచ్చాయి. అలాగే వ్యక్తులుగా, సంస్థలుగా ఇచ్చినవి అనేకం, ఆ లిస్టు పెద్దది.

**పిల్లల టెలీఫిల్మ్స్ :** పాండవులు, అడవిపూలు, బొన్సాయ్, తమసోమా ఇవి మూడు స్వర్ణ నందులు, ఒకెంట నందిని తీసుకు వచ్చాయి. 'భారతి' పిల్లల సినిమాకు స్వర్ణ నంది వచ్చింది. ఇప్పుడు 'మాయాలోకం' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ 2024 పురస్కారం ఇస్తున్నారు.

**అనువాదాలు :** నా నవలలు మూడు కన్నడంలోకి అనువాదం అయ్యాయి. కథలు కన్నడం, వంద భాషల్లోకి అనువదించారు.

**బాలసాహిత్య అనుభవాలు :** నా 87 నవలల్లో సగానికి పైగా పిల్లల పాత్రలతో ఉంటాయి. అనేక కథలు రాశాను. ప్రజాసాహితి పత్రికలలో 'పిల్లల ప్రపంచం' శీర్షికను నిర్వహించాను. 'వాయిస్ ఆఫ్ చిన్ని', 'మేం గోకులమ్', 'చుక్ చుక్ రైలు' వంటి శీర్షికలు నిర్వహించాను. చిన్నీ కథలు రాశాను. రేడియోలో నా పిల్లల నవలలను నాటకీకరణ చేశారు. బాలసాహిత్యం రాయటం వల్ల నాకు సరళంగా చెప్పటం అలవాటు అయింది. అన్ని రకాలుగా రాయటం వల్ల నాకంటూ ఓ శైలి ఏర్పడింది.

నా జీవితంలో ఇంకొన్ని పిల్లల నవలలు రాయటానికి పూనుకుంటున్నాను. పిల్లలు కూడా రచయితలు కావాలన్నది అప్పటి నుండి నా తాపత్రయం.

అవన్నీ ఈ రోజు వాస్తవాలు అయ్యాయి. అందుకు గరిపల్లి అశోక్ నుండి పదులకొద్దీ రచయితలు, రచయిత్రులు, సంస్థలు, పత్రికలు కృషి చేస్తున్నాయి.

అందరికీ పేరు పేరునా అభినందనలు నమస్సులు.

**ప్రశ్న : ఈనాటి బాలసాహిత్య తీపితెన్నులు – రావలసిన మార్పుల గురించి చెప్పండి.**

జవాబు : ఇప్పుడు బాలసాహిత్య రచయితల సైన్యం తయారయింది. ఎవరి పద్ధతుల్లో వారు రాస్తున్నారు. గేయాలు, కథలు, తక్కువగా అయినా నవలలు వస్తూనే ఉన్నాయి. అన్ని పత్రికలు పిల్లల కోసం స్పేస్‌ని కేటాయిస్తున్నాయి. పిల్లల పత్రికలు వస్తున్నాయి.

అయితే బాలసాహిత్య రచయితలు, రచయిత్రులు ఆధునిక బాలల జీవితాల గురించి రాయాలి. సైన్స్ ఫిక్షన్ రాయాలి. జీవితం గురించి వారికి చెప్పాలి. ఇవన్నీ అంత సులభం కాదు. అందుకు ఎంతో పరిశోధన కావాలి. పిల్లలకు ఏది ఎంత వరకు చెప్పాలో మనకు తెలియాలి.

ముందు పిల్లల్ని చదివించగలగాలి. తెలుగులో చదువుతున్న వారు గ్రామసీమల్లో ఉన్నారు. అంత ఆంగ్లమయం – కాగా పిల్లల్లో అద్భుతమైన ఊహలు, కళలు దాగున్నాయి. ఫ్యాంటసీని, వాస్తవాన్ని మనం జోడించి రాయగలగాలి. అప్పుడు పెద్దవాళ్లు చదువుతారు. వారు పిల్లలకు చెబుతారు. అలా ముందుకు పోవాలి. ఉపాధ్యాయులు, సంస్థలు సామాజిక కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలి. అప్పుడు మాత్రమే 'బాలసాహిత్యం' ఓ ఆదర్శ ఉద్యమంగా ముందుకు వెళ్తుంది.

14.11.2024న కేంద్ర సాహిత్య అకాడమీ వారు లక్నోలో 'మాయాలోకం' నవలకు బాలసాహిత్య పురస్కారం అందించారు.

15.11.2024న కేంద్ర సాహిత్య అకాడమీ వారు 22 భాషల నుండి పురస్కారం పొందిన రచయితలు, రచయిత్రులతో జరిపిన సమావేశంలో క్రియేటివ్ ఎక్స్‌పీరియన్సెస్ మీద ప్రసంగించటం జరిగింది.

– ఇంటర్వ్యూ చేసినవారు
**శ్రీ గరిపల్లి అశోక్**
బాలసాహితీవేత్త
m : 9849649101

## వేమన పద్యాలు

శతకం

**భూమి నాది యనిన భూమి ఫక్కున నవ్వు**
**దాన హీనుఁజూచి ధనము నవ్వు**
**కదన భీతుఁ జూచి కాలుఁడు నవ్వును**
**విశ్వదాభిరామ వినురవేమ**

తాత్పర్యం : ఈ భూమి నాది అని ఎవరైనా అంటే భూదేవి నవ్వుతుందట దానము చేయని వారిని చూసి ధనము నవ్వుతుందట. యుద్ధానికి భయపడే వాడిని చూసి యమధర్మరాజు నవ్వునట.

**నీళ్ళ లోన మొసలి నిగిడి యేనుఁగుఁ బట్టు**
**బైట కుక్క చేత భంగపడును**
**స్థాన బలిమి గాని తన బలిమి కాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ**

తాత్పర్యం : మొసలి నీళ్లలో ఉన్నప్పుడు, ఏనుగునైనా పట్టుకొంటుంది. అదే బయటకి వస్తే కుక్కకి భయపడుతుంది. నీళ్లలో ఉన్నప్పుడు అది స్థానబలం అవుతుంది గాని తన బలం కాదు.



# కథా రచయితగా జగదీశ్ చంద్రబోస్

రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన బెంగాలీ కథ "కాబూలీవాలా" చాలా ప్రఖ్యాతమైంది. అందులో మినీ అనే బాలిక ప్రధాన పాత్ర ఆ కథను నడిపిస్తుంది. 1891లో రాసిన ఈ కథను శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ లండన్‌లో చదువుకునే కాలంలో ఇంగ్లీషులోకి అనువదించారు. దానిని ప్రఖ్యాతమైన అమెరికా సాహిత్య పత్రిక 'హార్పర్' మ్యాగజైన్‌కు ప్రచురణార్థం పంపారు. అయితే ఆ పత్రిక వాళ్లు రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యం గురించి పాఠకులకు ఆసక్తి లేదు, అందుకని ప్రచురించడం లేదని ఉత్తరం పంపారు.



1913లో ఆసియాలో తొలి సాహితీ నోబెల్ బహుమతి రవీంద్రనాథ్ ఠాగూర్ కు లభించింది. దాంతో 'హార్పర్' మాగజైన్ వారు మళ్ళీ జగదీష్ చంద్రబోస్‌ను సంప్రదించి, రవీంద్రనాథ్ ఠాగూర్ గురించి ఏదైనా రాయమని కోరారు. జగదీశ్ చంద్రబోస్ కు కొన్నేళ్ల క్రితం జరిగిన అవమానం గుర్తుకొచ్చి, అప్పుడు వెనక్కి పంపించిన కథనే మళ్ళీ పంపారు. అప్పుడు క్షమాపణలు చెబుతూ 'హార్పర్' పత్రిక ఆ కథను ప్రచురించింది.

మీకు ఆశ్చర్యంగా ఉంది కదా? నిజానికి జగదీశ్ చంద్రబోస్ గొప్ప సాహిత్య అభిమాని, సాహిత్య వేత్త! అంతకుమించి ఠాగూర్, ఆయనా సన్నిహిత మిత్రులు. తరచూ వారి మాతృభాష బెంగాలీలో ఉత్తరాలు ఒకరికొకరు రాసుకునేవారు. కొన్ని సందర్భాల్లో ఉత్తరాలు కవితలుగా మారిపోయేవి. బోస్‌కి మహాభారతంలోని కర్ణుని పాత్ర అంటే చాలా అభిమానం. బోస్ కోరికపై రవీంద్రనాథ్ ఠాగూర్ 'కర్ణ-కుంతి సంవాదం' అనే పద్య రచన చేశారు.

వైర్లెస్ టెలిగ్రాఫీ రూపొందించిన జగదీష్ చంద్రబోస్ పేటెంట్ తీసుకోకపోవడం వల్ల నమోదు కాలేదు. తర్వాత దాన్ని సాధించిన మార్కోని రేడియో ఆవిష్కర్తగా పేరుగాంచారు. మన దేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్తల్లో జగదీశ్ చంద్రబోస్ (1858-1937) ముందు వరుసలో ఉంటారు. వారు శాస్త్ర పరిశోధనలు మాత్రమే కాకుండా, సైన్స్ ను ప్రచారం చేస్తూ ఎన్నో వ్యాసాలు విరివిగా రాశారు.

అలాగే ఆయన 1896లో బెంగాలీ భాషలో కథ రాశారు. 'నిరుద్దేశర్ కహాని' అని దాని పేరు. దాని అర్థం 'తప్పిపోయిన వ్యవహారం' లేదా 'దొరకనిది అని మనం తెలుగులో చెప్పుకోవచ్చు. మనదేశంలో మన దేశభాషల్లో వచ్చిన తొలి సైన్స్ ఫిక్షన్ కథ అదే. సైన్స్ ఫిక్షన్ అంటే శాస్త్ర పరిశోధనల ఆధారంగా రచయిత తన ఊహలు జోడించి, సైన్సు భావనలకు విరుద్ధం కానటువంటి రీతిలో చేసే కల్పనాత్మక రచన. 1921లో ఈ కథను కొద్దిగా మార్పు చేసి 'పోలాతక్ తుఫాన్' జగదీశ్ చంద్రబోస్ ప్రచురించారు.

- డా నాగసూరి వేణుగోపాల్
m : 9440732 392




యాత్ర

# తెలంగాణ - పర్యాటక స్థావరాలు - I

భారతదేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణా భౌగోళికంగా దక్కను పీఠభూమిలో భాగంగా సుందరమైన, సుసంపన్నమైన ప్రాంతం. చరిత్ర పూర్వ యుగం, తొలిపాత రాతియుగం, మధ్యపాత రాతియుగం, తరువాత పాత రాతియుగం, సూక్ష్మరాతి యుగం, కొత్తరాతి యుగం, బృహత్ శిలాయుగం, తొలి చారిత్రక యుగాలలో తెలంగాణ ప్రాంతం ప్రత్యేకమైన ఉనికిని కలిగియున్నది. శిలాజాలు, వాటి ఆదిమమానవుని నివాస స్థలాలు, రాతి చిత్రాలు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాలలో పలు ఆనవాళ్లను పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారులు మనకు అందించారు. అలాగే 75,000 ల సంవత్సరాల ముందు నుండే ప్రాచీన చరిత్ర మనకు ఉంది. దక్షిణాదిన ఏకైక మహజనపదం అస్మక రాజ్యం మన గోదావరి తీరంలోనే ఉండటం మన ప్రాచీన చరిత్రకు నిదర్శనం. ఇంతటి ప్రాచీన చరిత్రను కలిగిన ఈ నేలలోనే అనేక రాజులు రాజవంశాలు తమ సామ్రాజ్యాలను స్థాపించుకొని పాలించారు. ఈ ప్రాంతాన్ని శాతవాహనుల ముందు స్థానిక రాజులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, రాష్ట్ర కూటులు, కళ్యాణీచాళుక్యులు, కందూరు చోళులు, కాకతీయులు, ముసునూరి, రేచెర్ల పద్మనాయకులు, విజయనగర రాజులు, బాహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు పరిపాలించారు. అలాగే బ్రిటీష్ కాలంలో భారతదేశాన్ని పాలించిన ఆంగ్లేయులు ఈ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పాలించకున్నా ఇక్కడి పాలకుల సమన్వయంతో అనేక ప్రాంతాలలో విలక్షణ శైలిలో అప్పటి చారిత్రక కట్టడాలుగా నేటికి నిలిచి ఉన్నాయి. ఇంతటి చారిత్రక నేపథ్యమున్న ఈ తెలంగాణ ప్రాంతంలో చరిత్రకు తెలియని చారిత్రక వారసత్వ సంపద ఎంతో ఉంది. నదీతీరాలు, సహజ జలపాతాలు, అభయారణ్యాలు, చారిత్రక కోటలు, బౌద్ధ, జైన, హిందూ వారసత్వ కట్టడాలు, సంస్థానాలు, గిరిజన సంస్కృతి, గ్రామీణ సంస్కృతి, సాంస్కృతిక కళలు, కళారూపాలు, చిత్రాలు, శిల్పాలు, హస్తకళలు, ఇక ఆధునిక సంస్కృతి ఉండనే ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని సంస్కృతి సంప్రదాయాలను కలబోసుకుని, భిన్నత్వంలో ఏకత్వంగా, ఉత్తర దక్షణ భారతానికి వారధిగా దక్షిణ భారతానికి సింహద్వారంగా ఉన్న మన రాష్ట్రాన్ని "మినీ ఇండియా"గా చెప్పుకోవడం మనందరికి గర్వకారణం.

ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న మన ప్రాంత చరిత్ర సంస్కృతి గురించి తెలుసుకోవటం చాలా అవసరం. రోజువారి యాంత్రిక జీవితంలో అలసట చెందే మనకు సెలవు రోజుల్లో మన చుట్టు ప్రక్కన ప్రాంతాలలో ఉన్న అక్కడి ఆహ్లాదకర ప్రదేశాలు, చారిత్రక స్థలాలు సందర్శించి ఉల్లాసంగా గడపటం టూరిజంలో భాగమే. పర్యటనల వల్ల స్థానికేతర ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, కళలు, విందులు వినోదాలు అనేక కొత్త కొత్త విషయాలు తెలుసుకొనే అవకాశం మనకు కలుగుతుంది. దీనినే పర్యాటకం (టూరిజం) అని అంటారు. ఆయా ప్రదేశాలను చూసి రావడాన్ని "టూరిజం యాక్టివిటీ" అని అంటారు. పర్యటనలు చేపట్టటానికి ఎన్నో అంశాలు కారణమవుతుంటాయి. సాధారణంగా కొత్త ప్రదేశాలను, ప్రాంతాలను ఎందుకు చూస్తారంటే శారీరక విశ్రాంతి, మానసిక ప్రశాంతత, ఆహ్లాదం, వినోదం కోసం. అలాగే సంస్కృతి, కళలు, వేషభాషలు, తెగలు, జాతులు, మతాలు, జీవన విధానాలను తెలుసుకోవటం కోసం. స్నేహితులు, బంధువులు. కొత్త వ్యక్తులతో కలిసి వారి నుండి కొత్త విషయాలు తెలుసుకోవడం ద్వారా వ్యక్తిగత సంతృప్తి, కుటుంబ సమేతంగా మానసికోల్లాసాన్ని పొందగలుగుతారు.

– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177






# అమెరికాలో పిల్లలకు గ్రంథాలయాలు ఎలా అలవాటు చేస్తారు

మసాచుసెట్స్ రాష్ట్రంలో బోస్టన్ దగ్గరలో నార్త్ చెమ్స్ ఫర్డ్ ఒక చిన్న పట్టణం. ఆ పట్టణంలో ఒక పెద్ద గ్రంథాలయం చాలా చక్కగా నిర్వహించబడుతుంది. పిల్లలు, పెద్దలు ఆనందంగా ఈ గ్రంథాలయానికి వచ్చి అనేక కార్యక్రమాలలో భాగస్వాములు అవుతారు. పుస్తకాలు నిరంతరం తీసుకు వెళుతూ ఉంటారు.

ఈ గ్రంథాలయాన్ని ప్రభుత్వం నిర్మించింది. దీనితోపాటు ప్రజల భాగస్వామ్యం ప్రజల సహకారం అధికంగా ఉంటుంది. ఈ గ్రంథాలయంలో రెండు అంతస్థులు ఉన్నాయి. మొదటి అంతస్తులో సగభాగం పిల్లల గ్రంథాలయం. ఆ గ్రంథాలయంలో అనేక రకాల పిల్లల పుస్తకాలు ఆడియో వీడియో క్యాసెట్లు. ఒక వైపు పిల్లలకు సంబంధించిన రకరకాల బొమ్మలు పజిల్స్ కంప్యూటర్స్ డ్రాయింగ్ టేబుల్స్ ఇంకా పిల్లలను ఆకర్షించే రకరకాల కృత్యాలు నిర్వహించబడుతున్నాయి.


అత్యంత అధునాతనంగా నిర్మించిన గ్రంథాలయములో పిల్లలకు ఆకర్షణీయంగా ఉండేందుకు గోడలపై రకరకాల బొమ్మలు చిత్రించిబడి ఉన్నాయి. ఒక వైపు మీటింగ్ హాలు. ఆ మీటింగ్ హాలులో వారంలో ప్రతిరోజూ రకరకాల వయసుల పిల్లలకు వారి వయసుకు సంబంధించిన రైమ్స్ కథలు చెబుతారు. యాక్షన్ తో పాటు కథలు చెప్పే టీచర్ కం లైబ్రేరియన్ ఉంటారు. రకరకాల బొమ్మలను ఉపయోగించి హావభావాలతో టీచర్ కథలు చెబుతుంది. రైమ్స్ పాడేటప్పుడు తల్లిదండ్రులు కూడా టీచర్‌తో పాటు యాక్షన్ చేస్తూ రైమ్స్ పాడుతూ ఉంటారు. నెలల వయస్సున్న పిల్లల్ని కూడా తల్లిదండ్రులు ఈ ఆటపాటలు కథల కోసం తీసుకురావడం విశేషం. ఆనందంగా రైమ్స్ కథలు చెప్పే టీచర్. టీచర్‌తో పాటు పాడుతూ అభినయం చేస్తున్న తల్లిదండ్రులతో కలిసి నేర్చుకోవడం చిన్న వయసులోనే పిల్లలకు అలవడుతుంది. అమ్మా, నాన్నలు, తాతా, తాతమ్మలు చాలామంది ఈ పిల్లల కార్యక్రమాలకు హాజరవుతారు. మిగిలిన గ్రంథాలయంలో పెద్దలకు చెందిన అనేక విభాగాలు ఉన్నాయి. సమావేశాలు ఏర్పాటు చేసుకొనుటకు సమావేశ మందిరాలు కూడా ఉన్నాయి. ప్రపంచంలోని అనేక భాషలకు చెందిన గ్రంథాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి.

ఎదిగే పిల్లలు స్కూలుకు వెళ్లిన తరువాత స్కూలులో కూడా గ్రంథాలయం ఉంటుంది. అక్కడ తప్పనిసరిగా గ్రంథాలయ పుస్తకాలు చదివి ప్రాజెక్టులు తయారు చేయడం, పుస్తక సమీక్షలు థీసిస్ లు తయారు చేయడం వంటి ప్రక్రియలు ఉంటాయి. కాబట్టి పిల్లలకు పుస్తకాలు చదవడం బాల్యంనుండే అలవాటుగా మారుతుంది.

– మంచికంటి
మరో గ్రంథాలయ ఉద్యమం
m : 99495335695

కథ

# వివాహాల్లో వింత పోకడలు



ఈ మధ్య మిత్రుడు సుబ్బారావు నా దగ్గరికి వచ్చి రాం ప్రదీప్, నాకు ఓ రెండు లక్షలు ఎక్కడైనా అప్పు ఇప్పించు, అమ్మాయి పెళ్లి వుంది అన్నాడు. నేను హనుమంతరావు దగ్గర తప్ప ఎక్కడా డబ్బులు తీసుకోను అని చెప్పా.

పెళ్ళికి ఎంత ఖర్చు పెడుతున్నావు అని అడిగాను.

మొత్తం పది లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు.

సుబ్బారావుకి పెద్దగా పొలం లేదు. ఉన్న ఒక ఇంటి స్థలం అమ్మాయికి ఇస్తున్నాడు. ఏదో ఒక షాప్‌లో గుమస్తాగా చేస్తున్నాడు. నెలకు పది వేలు జీతం.

ఎందుకు సుబ్బారావు, అంత ఖర్చు పెడుతున్నావు అన్నా.

వున్నదే ఒక్క అమ్మాయి. ఇప్పుడు కాకపోతే ఎప్పుడు పెడతాం అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు వంటి వాళ్లు చాలా మంది ఉన్నారు ఈ సమాజంలో.

నేను ఈ మధ్య రెండు, మూడు వివాహాలకు వెళ్ళినప్పుడు గమనించినఆ పెళ్ళిళ్లలో వింత పోకడలని మీతో పంచుకుంటున్నా.. (ఇవి మీకు కూడా తెలుసు అనుకోండి )

కేవలం ముఖ పరిచయం ఉన్న అందరిని వేల సంఖ్యలో పిలవడం. పిలిచిన వారు ఎవరు వచ్చారో కూడా గమనించే తీరిక ఉండదు. హాజరైన వారికి 6 నెలల తరువాత అసలు సదరు పెళ్లికి వెళ్లామని కూడా గుర్తుండదు.

ఎంగేజ్మెంట్ పేరుతో పెళ్ళి అంత ఆర్భాటం చేయడం. (కాబోయే వధూవరులను, పెళ్లి కాకుండానే, ఒక చోట కూర్చోపెట్టి, ఆహ్వానితులకు అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించమనడం), మరికొన్ని చోట్ల కుల పెద్దలు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం.

పెళ్లి కాకుండానే ప్రీ వెడ్ షూట్ అని సినిమా లెవెల్లో వింత, సామాజిక స్పృహ లేని భంగిమల్లో కాబోయే పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు ఫోటోలకు స్టిల్స్ ఇవ్వడం.

పెళ్లి కోసం లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన డెకరేషన్ 10 గంటల్లో, ఇంకో ఫంక్షన్ ఉంటే పీకి పారేయడం.

ఫోటోలని సహజంగా తీయకుండా తీయకుండా

ఫోటో గ్రాఫర్ కోసమే పెళ్లి చేసుకున్నట్టు, అతను చెప్పిన వింత భంగిమల్లో స్టిల్స్ ఇచ్చి ఫోటోల పరమార్థం లేకుండా చేయడం

పెళ్లి బట్టలకు కూడా లక్షల రూపాయలు ఖర్చు చేసి, జీవితంలో మళ్ళీ ఇంకో వేడుకకి కి వాడకుండా, డబ్బు వృధా చేయడం.

ఇంకా మెహందీ అని, సంగీత్ అని, బ్యాచిలర్ పార్టీ అని చెప్పే ఈవెంట్స్.


ఇక గిఫ్ట్ పేరుతో వచ్చే వస్తువుల, డబ్బుల విషయంలో గందరగోళం. మీరేమి ఇచ్చారని ఇతరులను గుచ్చి, గుచ్చి అడగటం

పైన చెప్పినవన్నీ పేద మరియు మధ్యతరగతి వారు, శక్తికి మించి, ఈ మధ్య విపరీతంగా పాటిస్తు, అప్పుల పాలవుతున్నారు.

ఈ విధానాలు ఒకరిని చూసి మరొకరు అనుసరిస్తూ, ఎదుటివారి ఆడంబరాలను చూసి మేము సైతం అని అప్పులు చేసి బంధువర్గాలకు మొక్కుబడిగా ఫోన్చేసి మేము పిలిచాము అని చాటింపు చేసుకొని, ఇతర ముఖ్యమైన పనుల వల్ల ఫంక్షన్ కి వెళ్ళని వారితో కక్షలు పెంచుకోవడం ఎక్కడి సంస్కృతి. అందుకే మన ఆడంబరాలకు ఇతరులను ఇబ్బంది పెట్టడం మానుకుందాం ముఖ్యమైన ఫంక్షన్లకు మాత్రమే బంధువులందరిని ఆహ్వానిద్దాం చిన్న చిన్న ఫంక్షన్లను కుటుంబంలోనే చేసుకుందాం.

ముగింపు -ఓ నలభై ఏళ్ల క్రితం నా చిన్న తనంలో లగ్నం పెట్టుకోవడానికి నలుగురు లేదా ఐదుగురు తెల్లవారు ఝామున వెళ్లేవారు. ఎవరినో అవమానించాలానే ఉద్దేశంతో ఈ పోస్ట్ రాయలేదు. డబ్బులు వున్నవాళ్లు అయితే పర్వాలేదు. ఆర్థిక స్థోమత లేని వారు మొహమాటాలకు పోయి, ఆర్థికంగా మరింతగా చితికి పొకూడదనే భావనతో..

**– యం. రాం ప్రదీప్**
m: 9492712836



చెట్టు - చేమ

# క్రిస్మస్ చెట్టు



హాయ్ బాలలూ..! ఎలా ఉన్నారు? అందరూ బాగున్నారా! మనం "బాల చెలిమి" సంచిక ద్వారా ప్రతినెల అత్యంత ప్రాధాన్యత గల ఏదో ఒక చెట్టు గురించి చెట్టు-చేమ శీర్షికన తెలుసుకుంటున్నాం కదా...! ఇప్పుడు చలికాలం వచ్చేసింది. డిసెంబర్ నెల అనగానే మనకు గుర్తుకు వచ్చే చెట్టు క్రిస్మస్. దీని గురించి కొన్ని వివరాలు మనమూ తెలుసుకుందామా!

క్రిస్మస్ చెట్టు ఒక సతత హరిత చెట్టు. నిత్య జీవనానికి ప్రతీక ఇది. క్రిస్మస్ అనేది క్రైస్తవ మతస్తుల కు అతి పెద్ద పండుగ. ఈ పండుగ ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న వస్తుంది. ఏసు క్రీస్తు పుట్టినరోజున క్రిస్మస్ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే పండుగ రోజున చర్చిలలో, ఇండ్లలో "క్రిస్మస్ ట్రీ" ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది. క్రిస్మస్ చెట్టు ఒక అలంకరించబడిన చెట్టు. సాధారణంగా స్ప్రూస్, పైన్ లేదా ఫిర్ వంటి సతత హరిత సూదిమొన ఆకులు కలిగిన చెట్టు. సాంప్రదాయకంగా ఈ చెట్టు అలంకరణ క్రిస్మస్ వేడుకలతో ముడిపడి ఉంటుంది. వాస్తవ చెట్టును ప్రతిబింబించేలా కృత్రిమ క్రిస్మస్ చెట్టు తయారు చేస్తారు. ఈ చెట్టును ఆపిల్ గింజలు, విత్తనాలు, కాయలు వంటి తినదగిన ఆహార పదార్థాలతో అలంకరిస్తారు. 18వ శతాబ్దంలో ఈ చెట్టు అలంకరణలో కొవ్వొత్తులను అలంకరించడం ప్రారంభమైంది. ఆ తదుపరి విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా ఈ చెట్టు అలంకరణలో కాగితాలు, చెరుకు గడలు వంటి వాటితో పాటు అనేక రకాల ఆభరణాలను ఉపయోగిస్తున్నారు. దేవదూత గాబ్రియేల్ లేదా బెత్లెహమ్ సూచికగా చెట్టు చివరన ఒక నక్షత్రాన్ని ఉంచుతారు. క్రిస్టియన్ సింబాలిజంతో ఏర్పాటు చేసుకుని క్రిస్మస్ చెట్టు చుట్టూ అనేక బహుమతులు పెడతారు. చూడడానికి ఎంతో అందంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

క్రిస్మస్ చెట్టుతో పాటు మనకు గుర్తుకు వచ్చేది శాంతా క్లాజ్. ఇతడు ఉత్తర ధ్రువం వద్ద నివసిస్తున్నట్టు చెబుతారు. అక్కడ అతను తన దయ్యాల సహాయంతో బొమ్మలు తయారు చేస్తూ సంవత్సరం పాటు గడిపేవాడు. అక్కడ అతను క్రిస్మస్ బహుమతులు కోరుతూ పిల్లలనుండి ఉత్తరాలు అందుకుంటాడు. క్రిస్మస్ ఈవ్ నాడు అతను తన స్లిఘ్ ను బొమ్మలతో లోడ్ చేస్తాడు. మరియు ఎనిమిది రెయిన్ డీర్లచే ప్రపంచవ్యాప్తంగా ఎగురుతాడు. అందుకే ఈ శాంతాక్లాజ్ ప్రతిమలు కూడా ఏర్పాటు చేయబడి పిల్లలను, పెద్దలను ఆకర్షింపబడతాయి. ఈ సెక్యులర్ క్రిస్మస్ వేడుకలలో క్రిస్మస్ చెట్టుతో పాటు శాంతా క్లాజ్ కూడా ప్రత్యేక ఆకర్షణ.

చూశారా బాలలూ! ప్రపంచవ్యాప్తంగా క్రిస్టియన్ల పండుగ క్రిస్మస్ రోజు క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేసుకొని, ప్రత్యేకంగా అలంకరింపజేసి అందరినీ ఆకర్షింప చేస్తారు. ఇదండీ క్రిస్మస్ చెట్టు ప్రాధాన్యత. వచ్చే నెలలో మన బాల చెలిమి మేగజైన్లో మరో చెట్టు గురించి తెలుసుకుందాం.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655

పంచతంత్ర కథలు

# రెండు హంసలు – తాబేలు కథ



ఒక కొలనులో ఒక తాబేలు, రెండు హంసలు ఎంతో స్నేహంగా ఉండేవి. కొన్నాళ్ళకు ఆ కొలనులోని తామరతూడులు అయిపోయాయి. దానితో హంసలు రెండూ ఆహారం కోసం దూరంగా ఉన్న కొలనుకు పోవలసి వచ్చింది. అక్కడ చాలా తామరలు ఉన్నాయి. తాబేలు తాను కూడా వాటితో వెళ్ళడానికి తయారు అయింది. "మేము ఆకాశంలో ఎగురుతూ వెళతాం కాబట్టి మాతో నీకు రావడం కుదరదు. నువ్వు ఇక్కడే ఉండు. మేము తరచుగా వచ్చి నిన్ను చూసి వెళతాం" అని హంసలు చెప్పినా తాబేలు వినలేదు. తాను కూడా వెళ్ళవలసిందేనని పట్టుబట్టింది.

అప్పుడు హంసలు తాబేలును చూసి జాలి పడ్డాయి. ఒక ఉపాయాన్ని ఆలోచించాయి. ఒక కర్రపుల్లను తెచ్చి, దాని మధ్యలో నోటితో గట్టిగా కరచి పట్టుకోమని ఆ తాబేలుకు చెప్పాయి. "నోరు తెరిస్తే క్రిందపడి చస్తావ"ని కూడా దాన్ని హెచ్చరించాయి. ఆ రెండు హంసలూ ఆ కర్రపుల్ల రెండు చివరల్నీ తమ ముక్కులతో కరచిపట్టుకుని ఎగరపోసాగాయి. నేల మీద నుండి ఈ వింతను చూసిన జనం ఈలలు వేసి, చప్పట్లు చరచసాగారు. తాను నోరు తెరువరాదన్న హెచ్చరికను మరిచిపోయి, "ఏమిటా కలకలం?" అని తాబేలు అడగబోయింది. ఇంకేముంది – క్రిందపడి ప్రాణాలు పోగొట్టుకుంది.

**నీతి : మేలుకోరే వారి మాట వినకపోవటం వినాశనాన్ని కొని తెచ్చుకోవడమే.**

సేకరణ : అమరావతి

పంచ భూతాలు


# నీరు



గాలి లాగె నీరు కూడ
మనకు అవసరం
పంటకైన వంట కైన
నీరు అవసరం
నీరు లేక బతుకు లేదు
నమ్ము నిజం
నాగరికత లేక పోను
నిజం నిజం

– బెలగాం భీమేశ్వరరావు
m : 99895 37835

నెలలు





మార్గశిర మాసం

# మార్గశిర మాసం

శాలివాహన శక కాల పరిగణనలో మార్గశిర మాసం తొమ్మిదవ నెల, మృగశిరా నక్షత్ర కాంతి పరిధిలో సూర్యచంద్రుల గమనాన్ని బట్టి ఈ నెలకు ఈ నక్షత్రం పేరు మీద 'మార్గశిర మాసం' అని పేరు వచ్చింది.

ఈ నెల 'ధనుర్మాసం' అని కూడా అంటారు. ధనుస్సు వంగినట్లుగా చలి తీవ్రతకు ప్రజలు వంగి పోతారని – దీనికి ధనుర్మాసం అని పేరు వచ్చింది.

ఋతువుల వరసలో ఇది శరదృతువు. శరద్ ఋతువు మంచు గాలులకు ప్రసిద్ధి. ఎదుట ఉన్న వస్తువు కూడా కనపడనంతటి మంచు ఈ ఋతువులో కురుస్తుంది. అలా కార్తీకం వెళ్లే వరకు కురుస్తుంది.

మార్గశిరం వచ్చిందంటే ఆడపిల్లలకు ఎంతో సరదా అయిన ఆటపాటలు మొదలవుతాయి. గొబ్బిళ్లు పెట్టడం, గొబ్బి పూజ చేయడం, పాటలు పాడడం. ఇవన్నీ తెల్లవారగట్ల లేచి చేయడంలోనే 'ఓజస్సు' నిండిన గాలిలో తిరగడం, ఆడడం, పాడడం మొదలైనవి జరుగుతాయి.

ఆరోగ్యాన్ని ఇచ్చే ఈ ఆచారం పిల్లలకు నేర్పడం ఎంతో ఉపయోగకరమైనదని పెద్దలు చెపుతారు. అందుకే మార్గశిర మాసం అంటే అంత భక్తి.

## డిసెంబర్


క్రీస్తు శక కాల పరిగణలో 'డిసెంబరు' పన్నెండవ నెల. కాని, జూలియస్ సీజరు క్యాలెండరును మార్పు చేసినప్పటికీ అంతకు పూర్వం ఉండే 'పదవ నెల' అని అర్థం వచ్చేదయినా, ఆ పేరును పన్నెండవ నెలకు వాడుతూనే ఉన్నారు.



పాశ్చాత్యుల క్యాలెండరులో డిసెంబరుకు 'క్రిస్టమస్' వలన ఎంతో ప్రాధాన్యత, పవిత్రత వచ్చింది. డిసెంబరు 25వ తేదీ మొదలు జనవరి ఒకటవ తేదీ వరకు ఈ పండుగలు ఎంతో ఆనందప్రదంగా జరుగుతాయి. క్రైస్తవ లోకం ప్రపంచమంతటా క్రిస్టమస్ పండుగను ఘనంగా జరుపుకొంటుంది.

– 'బాల కథా సౌరభం' నుండి...

డిసెంబర్, 1990, బాలచెలిమి మాసపత్రిక నుండి...




సమాప్తం

స్పోర్ట్స్

## టీ 20 చరిత్రలోనే 28 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారత క్రికెటర్

# ఉర్విల్ పటేల్



### 35 బంతులలో 7 ఫోర్లు, 12 సిక్సర్లతో 113 నాటౌట్

గుజరాత్ జట్టు వికెట్ కీపర్, బ్యాటర్ ఉర్విల్ పటేల్ టి20 క్రికెట్ టోర్నీ 1 ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా త్రిపుర జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఉర్విల్ పటేల్ గ్రౌండ్‌లో తన ఆటను కనబరిచాడు. కేవలం 28 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌తో ఉర్విల్ 100 పరుగులను టీ20 ఫార్మాట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారత క్రికెటర్‌గా రికార్డ్ నెలకొల్పాడు. శతకం సాధించిన రెండో ప్లేయర్‌గా అతను గుర్తింపు పొందాడు. టీ20లలో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారతీయ ప్లేయర్‌గా రిషబ్ పంత్ (ఢిల్లీ ప్లేయర్‌గా 2018లో హిమాచల్ ప్రదేశ్ పై 32 బంతుల్లో సెంచరీ సాధించాడు).

ఉర్వి మెరుపులతో త్రిపుర నిర్దేశించిన 156 పరుగులు లక్ష్యాన్ని గుజరాత్ కేవలం 10.2 ఓవర్లలో అవలీలగా స్కోరుని ఛేదించింది. ఓపెనర్‌గా ఉర్విల్ 35 బంతుల్లో 7 ఫోర్లు, 12 సిక్సులతో 113 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలో ఉర్విల్ గుజరాత్ టైటాన్స్ జట్టుతో ఉన్నాడు. ఉర్విలు ఒక్క మ్యాచ్‌లోను ఆడే అవకాశం ఇవ్వలేదు.

# చరిత్ర సృష్టించిన టీంమిడియా



పెర్త్‌లోని ఆప్టస్ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియాల మధ్య టెస్ట్ మ్యాచ్ హెూరాహెూరీగా సాగింది. ఈ టెస్టు మ్యాచ్‌లో భారత్ విజయం సాధించేందుకు ఆస్ట్రేలియాకు 534 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆస్ట్రేలియా జట్టును 295 పరుగుల తేడాతో చిత్తుచిత్తుగా ఓడించి టెస్ట్ మ్యాచ్‌లో రారాజుగా భారత్ నిలిచింది. మ్యాచ్ మొదలైనప్పటినుండి కంగారూలు తమ ఆధిపత్యాన్ని కనబరిచారు. కంగారూలు.. బుమ్రా సేన పోరాటం ముందు నిలబడలేకపోయారు.

అరేళ్ళ తర్వాత ఈ ఆప్టస్ స్టేడియంలోనే భారత్,

# చెస్ చాంపియన్‌షిప్ గ్రాండ్ మాస్టర్‌గా

# డి. గుకేశ్



గుకేశ్ వ్యూహాత్మకమైన ఆలోచనతో పావులు కదుపుతూ డింగ్‌కు చమటలు పట్టించాడు. ఈ ఛాంపియన్ షిప్ టైటిల్‌లో మొత్తం 14 రౌండ్లలో మొదటగా 7.5 పాయింట్లకు చేరుకున్న ఆటగాడు విజేతగా నిలుస్తాడు. గుకేశ్ మాట్లాడుతూ "చాలా గొప్పగా అనిపిస్తోంది. గత రెండు రోజులుగా నేను ఆడిన ఆటపై సంతోషంగా ఉన్నాను. ఈ రోజు నా ఆట మరింత మెరుగ్గా ఉంది. నేను బోర్డ్ వద్ద మంచి అనుభూతి పొందాను, నా ప్రత్యర్థిని ఓడించగలిగాను. ఇలాంటి విజయాలు సాధించడం ఎల్లప్పుడూ బాగుంటుంది." అని చెప్పాడు.

ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఆటగాడు, చెన్నైకి చెందిన 18 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ డి.గుకేశ్. చైనా ఆటగాడు డింగ్ లిరెన్‌పై గుకేశ్ తొలిసారి విజయం సాధించాడు. ఛాంపియన్‌షిప్‌లో ఐదు గేమ్‌ల తర్వాత ఇద్దరి స్కోరు 2.5 పాయింట్లతో సమానంగా ఉన్నారు. మ్యాచ్‌లో 120 నిమిషాల్లో 40 ఎత్తులు వేయాల్సి ఉంటుంది. డింగ్ కేవలం రెండు నిమిషాల్లో తొమ్మిది ఎత్తులు వేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో

ఐదుసార్లు టైటిల్‌ను కైవసం చేసుకున్న విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న తొలి భారతీయుడుగా గుకేశ్. గుకేశ్‌కు ఆనంద్ మెంటార్‌గా ఉండటం గమనార్హం.

---

(27వ పేజీ తరువాయి...)

ఆస్ట్రేలియాలు ముఖాముఖి తలపడ్డాయి. బౌలింగ్, బ్యాటింగ్‌లోనూ ఫుల్ అగ్రెషన్ చూపించిన భారత్. ఈ గ్రాండ్ విక్టరీతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో మెన్ ఇన్ బ్లూ టాప్‌లోకి దూసుకెళ్లింది. బుమ్రా 72 పరుగులు ఇచ్చి 8 వికెట్లు తీశాడు. ఈ గెలుపుతో ఐదు అరుదైన రికార్డులను భారత్ కైవసం చేసుకుంది. 1977లో మెల్‌బోర్న్ టెస్ట్‌లో 222 పరుగుల, 2018లో 137 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది మెన్ ఇన్ బ్లూ. తాజా మ్యాచ్‌లో ఆసీస్ (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లోనూ భారత్ బిగ్గెస్ట్ విక్టరీగా నిలిచింది.

**భారత్ తొలి ఇన్నింగ్స్: 150 ఆలౌట్.**

**ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 104 ఆలౌట్.**

**భారత్ రెండో ఇన్నింగ్స్: 487/6 డిక్లేర్డ్.**

**ఆసీస్ రెండో ఇన్నింగ్స్: 238 ఆలౌట్.**

(హెడ్ 89, మార్ష్ 47, బుమ్రా 3/42, సిరాజ్ 3/51)

– సచిన్ కోత్వాల్
బాలచెలిమి, m: 9701001036

కథ



# చీమ – చందమామ

## మాక్సిమ్ టాంక్

అనగనగా ఒక అడవిలో ఓ చీమ నివసించేది. దానికి విశ్వంలో ప్రయాణించి చంద్రమండలాన్ని చేరాలని చిరకాల వాంఛ. అది తన చీమల సమూహంతో కలిసి మెలిసి ఓ చీమల పుట్టలో నివసించేది. రాత్రిళ్ళు అది చెట్టు ఎక్కి చంద్రుడిని, చుక్కల్ని, ఆకాశాన్ని చూస్తూ గడిపేది. ఎప్పటికైనా చంద్రుణ్ణి చేరతానని కలలు కనేది.

ఆ చీమల పుట్ట సమీపంలో ఓ ముళ్ళ పంది, నక్క, ఎలుగుబంటి, కొంగ నివసించేవి.

ఆ అడవికి దగ్గరలో ఓ పట్టణం వుండేది. పట్టణం లోని పిల్లలు సెలవు దినాన, పుట్ట గొడుగులు ఏరడానికి అడవిలోకి వెళ్ళారు. వాళ్ళు పుట్ట గొడుగులు ఏరడానికి కొన్ని పాత న్యూస్ పేపర్లని వాళ్ళ వెంట తీసుకువెళ్ళారు. ఇంతలో ఓ గాలి దుమారం వచ్చి, పేపర్లు గాలికి చెల్లాచెదురయ్యాయి.

వాటిలో ఓ దినపత్రికలోని పేజీ ఎగురుకుంటూ వెళ్ళి చీమల పుట్ట సమీపంలో పడింది.

మొదట ఆ పేజీని ముళ్ళ పంది చూసింది. చదవడానికి ప్రయత్నించింది. దానికి చదువు రాదన్న విషయం గుర్తొచ్చింది. సరే దినపత్రికలోని విషయాలు తెలుసుకుందామని, ఆ పత్రిక పేజీని నక్క వద్దకు తీసుకువెళ్ళింది.

ముళ్ళ పంది ఇలా అంది "నక్క బావా! నక్క బావా! ఈ దినపత్రిక కాస్త చదివిపెట్టవూ! నాకేమో చదువు రాదు కదా మరి"

నక్క ఇలా సమాధానం చెప్పింది "ముళ్ళ పంది అల్లుడూ! ఆ చదువే నాకొస్తే నేను ఇలా ఎందుకుంటాను, మనం ఎలుగుబంటి వద్దకు వెళ్లాం పద, అది మనకు సాయం చేస్తుందేమో".

ముళ్ళ పంది, నక్క ఇద్దరూ కలిసి ఎలుగుబంటి వద్దకు వెళ్ళారు.

"ఎలుగుబంటి గారూ! ఈ దినపత్రిక కాస్త చదివిపెట్టరూ! మాకేమో చదవడం రాదు" అన్నారు ఇద్దరూ.

ఇది విన్న ఎలుగుబంటి "హీ..హీ..హీ" అంటూ గట్టిగా నవ్వింది. చాలాసేపు నవ్విన మీదట తాపీగా ఇలా అంది.

"నేను చిన్నప్పుడే బడికి డుమ్మా కొట్టాను. కాబట్టి ఆ వచ్చిన నాలుగు అక్షరాలు మర్చిపోయాను. కాబట్టి నేను చదవలేను. కానీ మీకు కొంగ కానీ, చీమ కానీ సాయం చేయగలవు".

ముళ్ళ పంది, నక్క కలిసి కొంగ వద్దకు వెళ్ళి దినపత్రిక చదివి పెట్టమని ప్రార్థించాయి.

కొంగ అందుకు ఒప్పుకుని చదవడం ప్రారంభించింది.

అదే సమయానికి అటు నుండి వెళ్తున్న చీమ కూడా అక్కడకు చేరింది.

కొంగ పత్రికలోని విషయాన్ని చదివి ఇలా చెప్పింది "మరో రెండు రోజుల్లో, ఇద్దరు వ్యోమగాములు, ఓ రాకెట్టులో చంద్రమండలానికి ప్రయాణించబోతున్నారు. ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయి".

ఇది విన్న చీమ ఎంతో సంతోషించింది. తన చిరకాల వాంఛ తీరే సమయం వచ్చినందుకు ఎంతో సంతోషించింది.

చీమ ఓ చేతి కర్రను, కంపాస్‌ను తీసుకుని, బట్టల సంచి వీపుకు తగిలించుకుంది. బంధుమిత్రులకు వీడ్కోలు చెప్పి, చంద్రమండలానికి ప్రయాణాన్ని ప్రారంభించింది.

రాత్రింబవళ్ళు ప్రయాణించి పట్టణంలోని విమానాశ్రయాన్ని చేరింది. "టికెట్టు లేకుండా విమానంలోకి ఎక్కనివ్వరు కదా!" అన్న సందేహం వచ్చింది చీమకు.

విమానాశ్రయంలో కౌంటర్ వద్ద ప్రయాణికులు 'క్యూ'లో నిలబడి వున్నారు. వాళ్ళలో చిన్న పిల్లలు, యువకులు, యువతులు, వృద్ధులు వున్నారు.

కొందరు వెళ్ళే ప్రయాణానికి మాత్రమే టికెట్టు తీసుకుంటే, మరికొందరు తిరుగు ప్రయాణానికి కూడా టికెట్టు తీసుకుంటున్నారు. ఇదంతా శ్రద్ధగా గమనించింది చీమ.

"విమానంలో ప్రయాణించడం ఎలాగా?" అని ఆలోచించసాగింది. ఇంతలో చీమకు ఒక ఆలోచన వచ్చింది.

మెల్లగా చీమ ఓ ముసలావిడ బుట్టలోకి చేరింది. ఆ బుట్ట నిండా బహుమతులు వున్నాయి. ప్రయాణికులంతా విమానం ఎక్కారు. అలా ముసలావిడ బుట్టతోపాటు చీమ కూడా విమానంలోకి చేరింది.

విమానం మెల్లగా బయలుదేరింది. చీమ ఆసక్తిగా విమానంలో ఏం జరుగుతుందా అని చూద్దామనుకుంది. కాని తనను ఎవరన్నా చూస్తారేమోనని, ఆ ప్రయత్నాన్ని మానుకుంది.

ప్రయాణ బడలిక వల్ల మెల్లగా నిద్రలోకి జారుకుంది. కొన్ని గంటల తరువాత....

చీమ నిద్ర లేచింది. విమానం గమ్యస్థానాన్ని చేరింది. ప్రయాణికులు ఒక్కొక్కరూ దిగడం ప్రారంభించారు. వృద్ధురాలు తన బహుమతుల బుట్టతో దిగింది.

అప్పటికే ఆ ముసలావిడ కోసం వాళ్ళ కొడుకు ఎదురుచూస్తున్నాడు. 'అమ్మా..' అని అరుస్తూ ముసలావిడని కౌగలించుకున్నాడు. సరిగ్గా ఆ క్షణాన చీమ బుట్టలోంచి బయటకు దూకింది.

పరుగులాంటి నడకతో బయలుదేరింది. అప్పుడు సూర్యుడు అస్తమిస్తున్నాడు. విమానాశ్రయం అంతా గాలించి చివరికి రాకెట్ వున్న ప్రదేశాన్ని చేరింది.

బ్రహ్మ రాక్షసిలా వున్న రాకెట్‌ని చూసి చీమ మొదట భయపడింది. కానీ తరువాత స్థిమితపడింది.

'రాకెట్‌లోకి ఎక్కడం ఎలా' అని ఆలోచించింది. ఇద్దరు వ్యోమగాములు అప్పుడే రాకెట్‌లోకి అడుగు పెడుతున్నారు. చీమ మెల్లగా రాకెట్‌లోకి దూరింది. ఓ మూలన దాక్కుంది.

పెద్ద శబ్దం చేస్తూ, నిప్పులు కక్కుకుంటూ, రాకెట్ నింగి కెగసింది. కొన్ని గంటల తరువాత...

ఇద్దరు వ్యోమగాములు గాలిలో తేలుతున్నారు. చీమ వాళ్ళను చూసి తను పట్టుకున్న ఆధారాన్ని వదిలింది. ఆశ్చర్యం, అది కూడా గాలిలో తేలింది. చీమకు తన శరీరం దూదిపింజలా చాలా తేలికగా తోచింది. గమ్మత్తుగా అనిపించింది. మెల్లగా అలవాటు పడింది.



వ్యోమగాములు నిద్రపోయారు. చీమ మెల్లగా లేచి ఆహారం తిని, నీరు తాగింది. విమానంలోని టెలిస్కోప్ వద్దకు వెళ్ళి భూమిని చూసింది. భూమి గుండ్రంగా పిల్లలు ఆడుకునే బంతిలా వుంది.

భూమి పైన తను వున్న బిర్చి చెట్టు, చీమల పుట్ట కనిపించాయి. చీమ ఆనందంతో బిగ్గరగా అరిచింది "ప్రతి ఒక్కరూ! చూడండి. నేను గాల్లో ఎలా ఎగురు తున్నానో?"

చీమ మాటలు విని వ్యోమగాములు నిద్రలేచారు. వాళ్ళు ఆశ్చర్యపోయారు. రాకెట్‌లోకి ఎలా వచ్చావు మిత్రమా! అంతా కుశలమేనా!" అని అడిగారు.

చీమ భయపడింది. వాళ్ళు ఇలా అన్నారు "భయపడకు మిత్రమా! ఈ క్షణం నుండి ఈ రాకెట్లో వ్యోమగాములు ఇద్దరు కాదు, ముగ్గురు. నీవు కూడా మా శాస్త్రవేత్తల బృందంలో సభ్యుడివే".

ముగ్గురు వంతుల వారీగా పని చేశారు. ఎప్పటికప్పుడు వాళ్ళ సమాచారాన్ని, పరిశోధనల విశేషాల్ని శాటిలైట్ రేడియో ద్వారా భూమికి చేర్చేవారు.

చివరకు ఓ రోజు వాళ్ళు చంద్రమండలాన్ని చేరారు. చీమ ఆనందానికి అంతేలేదు. వ్యోమగామాలు వాళ్ళ దేశ జెండాని చంద్రునిపై పాతారు. చీమతో కలసి ఆ జెండా వద్ద ఫొటో దిగారు.

కొద్దిరోజులు చంద్రమండలాన్ని పరిశోధించారు. చీమ కూడా ఆ పరిశోధనలో పాలుపంచుకుంది.

చివరకి తిరుగు ప్రయాణమయ్యారు. కొన్ని రోజులు ప్రయాణించి భూమిని క్షేమంగా చేరారు. రాకెట్ విమానాశ్రయం చేరగానే, చీమ తన మిత్రులకు సెలవు చెప్పి, తను అడవి వైపు ప్రయాణం సాగించింది. దారిలో వర్షం పడింది. అయినా చీమ లెక్క చేయలేదు. చివరకి ఇల్లు చేరింది.

చీమల సమూహం చీమను ఆహ్వానించి, పూలమాలలతో ఘనంగా సత్కరించింది.

"చంద్రమండలంలో కాలుమోపిన తొలి చీమ" అని చీమల సమూహం, ముళ్ళ పంది, నక్క, ఎలుగుబంటి, కొంగ చీమను పొగిడాయి.

ఇదండీ పిల్లలూ! చంద్రునిపై కాలుమోపిన తొలి చీమ కథ. కలలు కని, వాటి కోసం కష్టపడితే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరవచ్చు. కలలు కంటూ వాటి సాధించడానికి కష్టపడతారు కదూ...!

**స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల**
m : 8179273974

ఇంగ్లీష్ : ఎ టేల్ ఆఫ్ ది కాస్మిక్ ట్రావెల్స్ ఆఫ్ ఆంట్‌ది ట్రాంప్
రైటర్ : మాక్సిమ్ టాంక్
ఇంగ్లీష్ అనువాదం : వాలేటర్ మే
బొమ్మ : ఎన్. గుటియేవ్
రష్యన్ జానపద కథల నుండి

కథ

# మాయ అద్దం

## (స్పెయిన్ దేశపు కథ)



రాజుగారు పెళ్లి చేసుకోవాలని నిశ్చయించారని గ్రనాడాలో వార్త వచ్చింది. విషయం ముందుగా ఆస్థానం మంగలికి తెలిసింది. తరువాత పహరాదారుకు చెప్పారు. ఆ తరువాత అందరికన్నా ముసలావిడకు చెప్పారు.

మంగలి తన దగ్గరకు వచ్చిన వారందరికీ సంగతి చెప్పాడు. వారు మరి కొంతమందికి చెప్పారు. విషయం చాలామందికి తెలిసింది. పహారాదారు తెల్లవారుజామున గంటలు ప్రకటించేటప్పుడు రాజుగారి పెళ్లి గురించి చెప్పాడు. సంగతి ఊరంతా తెలిసింది. పెళ్లి వయసు అమ్మాయిలు అందరూ ఆలోచనలో పడ్డారు.

రాజుగారు ఎవరిని పెళ్లి చేసుకుంటారు, ప్రశ్న బయలుదేరింది.

ఏమిటన్న మాట? ఒక అమ్మాయిని పెళ్లి చేసుకుంటారు, అన్నాడు మంగలి. అంతకన్నా జవాబు ఉంటుందా? అని కూడా అడిగాడు.

మరైతే రాజు గారికి ఇంత దేశంలో అమ్మాయి దొరకలేదా? అందరూ అడిగారు.

రాణిగారు కావలసిన మనిషిని వెతకడం అంటే మాటలా? అన్నాడు మంగలి. అదే మరి నా సమస్య అని కూడా అన్నాడు.

సమస్య నీకెందుకు? అడిగారు అందరూ.

అవునుమరి నాకుగాక మరెవరికి? అన్నాడు మంగలి.

అర్థమైందా? నేనెవరో? రాజుగారికి ఆంతరంగికుడిని. ఆయన గురించి నాకు తెలిసినంత మరెవరికీ తెలియదు. పైగా నా దగ్గర మాయా అద్దం ఉందాయె. రాజుగారిని పెళ్లి చేసుకోదలుచుకున్న అమ్మాయి ఆ అద్దంలోకి చూడాలి. ఆమె మనసులో మకిలి ఉంటే అద్దంలో ఊరికే తెలిసిపోతుంది. ఎటువంటి మకిలిలేని అమ్మాయిని రాజుగారు పెళ్లి చేసుకుంటారు.

అదా సంగతి? మరి ఆ అద్దంలోకి ఎవరు చూడాలి? అడిగారు అందరూ.

పదునెనిమిది సంవత్సరాలు నిండిన అమ్మాయి ఎవరైనా సరే! ఆమె అద్దంలోకి చూసేటప్పుడు నేను పక్కన ఉంటాను. అన్నాడు మంగలి.

రాణికాదలుచుకున్న అమ్మాయిలకు పెట్టే పరీక్ష గురించి అందరికీ తెలిసింది. చిత్రంగా, అద్దంలోకి చూస్తామంటూ ఎవరూ ముందుకు రాలేదు. వారాలు గడిచాయి. అయినా రాజుగారి పెళ్లికి అవకాశం రానేలేదు.

రాజుగారు అందగాడు. ఎంతో మంచివాడు కూడా. రాజ్యంలో అందరూ ఆయనను ఇష్టపడతారు. అయినా ఆయనకు భార్య దొరకడానికి అవాంతరమేమిటో ఎవరికీ అర్థం కాలేదు. కొంతమందికి అప్పటికే సంబంధాలు కుదిరాయి అన్నారు. మంగలి అంగడిలోకి మేము వెళ్ళడమేమిటి అన్నారు మరికొందరు.

అమ్మాయిలలో ఎవరూ ముందుకు రాకపోవడం తల్లిదండ్రులకు కూడా కష్టంగానే అనిపించింది.

రాజుగారు ప్రతినిత్యం మంగలిని సంగతి ఏమిటి అని అడుగుతూనే ఉన్నారు. అల్వాంబ్రాలో మా పూర్వీకులంతా హాయిగా కాపురాలు చేశారు కదా? నాకా అవకాశం లేదా ఏమిటి అని కూడా అన్నారు.

మహారాజా! అప్పట్లో ఈ మాయ అద్దం లేదు కదా? ఇప్పుడు కాలం మారింది కదా? అన్నాడు మంగలి.

మనిషికి తెలివి పెరిగిన కొద్దీ కష్టాలు కూడా ఎక్కువ అవుతాయా? అడిగారు రాజుగారు.

అంతేకాదు మహాప్రభో, ప్రజలంతా కూడా మారిపోయారు, అన్నాడు మంగలి. ఈ కాలంలో ఆడామగా అందరూ చాలా తెలివైనవాళ్ళు. అయినా తెలివిగలవాళ్ళు మాత్రం కాదు. కొంతమంది మోస గాళ్లు కూడా. తెలివికి ఈ మోసకారితనానికి మధ్యన గొప్ప వార ఉన్నది. ఏదేదో చెబుతున్నాడు మంగలి.

రాజు గారికి కోపం వచ్చినట్టుంది. ఒరేయ్ నాకు వెంటనే భార్య కాలిగిన ఆడమనిషి కావాలి. అది దీపం లాగా కళకళలాడుతుండాలి. బంగారం లాగా వెలిగిపోతుండాలి. మాయ అద్దంలోకి చూడడానికి భయపడని మనిషి కావాలి. అంటూ గట్టిగా గర్జించాడు రాజుగారు.

అయ్యా, నా దగ్గర ఉన్న అద్దంతో చిక్కు అసలు లేదు. ఉన్నదంతా ఆడంగుల మనసులలోనే. కొండమీద పల్లెలో ఉన్న మేకలుకాసే అమ్మాయి మహా తెలివిగలది. అద్దంలోకి చూడడానికి అసలు భయపడదు. ఆమె అమాయకత్వమే ఆమెకు రక్ష. అయితే మీరు అటువంటి అమ్మాయిని పెళ్లి చేసుకుంటారా? అడిగాడు అనుమానంగా మంగలి.

అటువంటి మనిషే నాకు కావాలి. వెలలేని ముత్యం వంటి మనిషి కావాలి. వెళ్లి ఆ అమ్మాయిని వెంట తీసుకురా. మహాసభలో అందరి ముందు ఆమె అద్దంలోకి చూస్తుంది. అంతకుముందే నీవు ఆమెకు అంతా వివరంగా చెప్పి ఉంచాలి. అన్నాడు రాజుగారు.

అమ్మాయిని రాజసభకు తీసుకురావడానికి మంగలి ఏమాత్రం ఆలస్యం చేయలేదు. పరీక్ష జరుగుతుందని పట్నంలో వాళ్లందరికీ ప్రచారం జరిగింది కనుక సభ మొత్తం అన్నివర్గాల ఆడమగ జనాలతో నిండిపోయింది. రాజకుటుంబం వారందరూ కూడా అక్కడే ఉన్నారు.

అందమైన పల్లెటూరి అమ్మాయి వచ్చింది. రాజసభలో ముందుగా కొంచెం సిగ్గుపడింది. అంతమంది, అంత వైభవం ఆమె ఎన్నడూ చూచి ఎరుగదు. అందరూ తనగురించి ఏమనుకున్నా తనకు మాత్రం పరవాలేదని అమ్మాయి గట్టిగా అనుకున్నది.

అమ్మాయి బాగానే ఉంది, రాజుగారికి అసంతృప్తి మాత్రం కలగలేదు. ఆమెను ఆదరంగా పిలిచాడు. తానుగాని మహారాణి కావాలని అనుకుంటే, అనుమానం లేకుండా అద్దంలోకి చూడాలి అని చెప్పాడు. మనసులోపల మర్మాలు ఉంటే అవన్నీ అద్దంలో కనిపిస్తాయని ముందే హెచ్చరించాడు.

మహా ప్రోఫ్, పైవాని దృష్టిలో అందరమూ లొసుగులు గలవారమే. బీద ఇంటి ఆడపడుచును. నా మేకలు తప్ప మరొకటి తెలియని దాన్ని. అందరూ నన్ను అభిమానించారు. మేకలు కూడా ఆపద ఉందని తెలిస్తే నాచుట్టూ చేరతాయి. నాకు ఆభరణాలు తెలియవు. అడవిపువ్వులు మాత్రమే తెలుసు. ఇంటి పైకప్పు తెలియదు. ఆకాశమే నా ఇంటికప్పు. నాకు నేస్తం అంటూ ఉంటే భగవంతుడు ఒక్కడే. కనుక నాకు అద్దంలోకి చూడడానికి ఎటువంటి భయము లేదు. రాణి కావాలని నేనేమీ కలలు కనడంలేదు గానీ. మీ మంచితనం గురించి మాత్రం నిండా నమ్మకం ఉంది. అన్నది ఆ పడుచు.

ఆ మాటలు అంటూనే అద్దం ముందుకు నడిచింది. అందులోకి తొంగి చూసింది. మెత్తగా సిగ్గు పడింది. తన అందమే తనకు ఆశ్చర్యంగా కనిపించినట్టు ఉంది. అంతకుముందు అద్దంలోకి చూచింది లేదు. నీటిలో ముఖం చూచుకోవడమే గొప్ప అనుభవం.

రాజపరివారంలోని ఆడంగులు అందరూ ఆమె చుట్టూ చేరారు. అద్దంలో ఎటువంటి లొసుగులు కనిపించలేదు. వాళ్లు అద్దాన్ని ఆమె చేతినుంచి లాక్కున్నారు. అందులో ముఖం చూస్తూ, అంతా మోసం, ఇందులో ఏ మాయ లేదు. మంగలి అందరినీ మోసగించాడు, అనసాగారు.


రాజుగారి మాట గంభీరంగా వినిపించింది.

అందరూ వినండి. పొరపాటు ఎక్కడో మీలోనే ఉంది. మేకలు కాసే అమ్మాయిలాగే మీరంతా అమాయకురాళ్ళు అయితే. అద్దంలోకి చూడడానికి ఎవరూ అనుమానించి ఉండేవారు కాదు. అన్నాడాయన.

అంగరంగ వైభవంగా పెళ్లి జరిగింది. పల్లెటూరి అమాయకురాలు మహారాణి అయ్యింది.

నా మాయ అద్దం ప్రభావం మాయమైంది. అంతకంటే గొప్ప విషయం ఏమీ లేదు. అని మంగలి అనడం కొంతమంది విన్నారు.

డా. కె.బి. గోపాలం
m : 98490 62055


19 వ తేదీ రాత్రి వచ్చిన
ఉప్పెన శక్తి

ఉప్పెన పొడవు, 50 మైళ్ళు, వెడల్పు 10 మైళ్ళు, ఎత్తు 19 అడుగులు, దానివేగం గంటకు 120 మైళ్ళు.

ఉప్పెనతో భూమిపైకి వచ్చిన సముద్రపు నీటి పరిమాణము 27,000 కోట్ల ఘనపు అడుగులు.

ఉప్పెన కెరటములో దాగివున్న పవరు ([illegible]) 52,000 కోట్ల అశ్వశక్తి (హార్సు పవరు).

ఉప్పెనలో [illegible] శక్తి 3250 కోట్ల యూనిట్లు (కిలోవాట్ అవర్స్). ఆ కెరటంను బంధించి అందు ఇమిడియున్న శక్తితో ఒక్కొక్కటి 5 హార్సు పవరుగల 30 లక్షల పంపుసెట్లను, రోజుకు 8 గంటల చొ.న ఒక సంవత్సరము పొడవునా నడుపవచ్చును. లేదా

విజయవాడ సమీపంలో నిర్మింపబడుచున్న 400 మెగావాట్ల థర్మల్ పవర్ స్టేషన్ 19 సంవత్సరాలపాటు [illegible] శక్తి ఆ కెరటంలో ఇమిడి యున్నది. కెరటం [illegible], ఒక టన్ను బరువు గంటకు 120 మైళ్ళ వేగములో [illegible].


కె. పి. ఆర్.

19/11/77- తుఫాన్:

1977 దివిసీమ ఉప్పెన శక్తి


Source : Google

## పొడుపు కథ




పిడికెడంత చిన్న ఇల్లు
దాన్లో నాలుగు గదులు
క్షణం తీరిక లేదు
దమ్మిడి ఆదాయం లేదు

– కందేపి రాణీప్రసాద్

సైన్స్

# బాలనర్తకి




ఇంద్రుడు ఆజ్ఞాపిస్తే అప్సరసలు నృత్యం చెయ్యవలసిందే. అలాగే చేతులూ కాళ్లూ ఆడిస్తూ చిత్రంగా నృత్యం చేసే బొమ్మను మన ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. దీనికి కావలసిన వస్తువులు: రబ్బరు బ్యాండ్, ఎనిమిది పేపరు క్లిప్పులు, దళసరి అట్టముక్క, అట్టపెట్టె.

బొమ్మలో చూపిన అమ్మాయిని దళసరి అట్ట ముక్క మీద "ట్రేసు" తీసి, జాగ్రత్తగా కత్తిరించాలి. దీనికి రంగులు కూడా వెయ్యవచ్చు. పేపరు క్లిప్పులు ఉపయోగించి, దానికి కాళ్లూ చేతులూ ఏర్పాటు చెయ్యాలి. సన్నని రబ్బరు బ్యాండ్‌ను ఈ బొమ్మ తలకి కట్టి, ఇనుప తీగకి వేలాడదియ్యాలి. ఈ బొమ్మకి సరిగ్గా కింద కొద్ది దూరంలో విద్యుదయస్కాంతాన్ని అమర్చి, దానికి బేటరీ, స్విచ్చి కలపాలి. ఈ గారడీ ప్రేక్షకులకు దుర్భేద్యంగా ఉంచడం కోసం అయస్కాంతం మీద అట్టపట్టెని బోర్లించి, కనిపించకుండా చెయ్యాలి. అంతే మిస్ పేపర్ క్లిప్ అనే నర్తకి నృత్యం చేయడానికి సిద్ధంగా ఉంది.

స్విచ్చి వేస్తే ఇనుప బోల్టు అయస్కాంతంగా మారి పేపరు క్లిప్పులను కిందికి లాగుతుంది. రబ్బరు బ్యాండ్ సాగుతుంది. కాళ్ళూ చేతులూ ఆడిస్తూ పైకి కిందికీ ఎగురుతూ ఆ బొమ్మ చిత్రంగా నృత్యం చేస్తుంది. స్విచ్చి తీసేస్తే ఆట ఆగిపోతుంది.

ఈ గమత్తు రక్తి కట్టాలంటే రబ్బరు బ్యాండ్ సున్నితంగానూ, అయస్కాంతం బలంగానూ ఉండాలి. బొమ్మ కాళ్లకీ, అయస్కాంతానికీ మధ్య దూరాన్ని జాగ్రత్తగా సర్దుబాటు చెయ్యాలి.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

## సామెతలు

- ఈతకు మించిన లోతే లేదు
- ఉరుములా వచ్చి మెరుపులా పోతాడు
- ఏమిరా పడ్డావ్ అంటే అదొక పట్టీలే అన్నాడంట
- కలిమి కలిగినోడు భలం కలిగినోడు
- ఉపాయాలున్నవాడు ఊరిమీద బ్రతుకుతాడు
- చెడపకురా చెడేవు
- దురాశ దుఃఖమునకు చేటు
- గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించినట్లు
- కాకి ముక్కుకు దొండ పండు
- కీడెంచి మేలెంచమన్నారు
- కృషితో నాస్తి దుర్భిక్షం
- మెరిసేదంతా బంగారం కాదు
- ముల్లును ముల్లుతోనే తీయాలి వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి

– బాలచెలిమి

రివ్యూ

# ‘బాల చెలిమి’ పిల్లల వికాస పత్రిక

ఈ పేరు చూడటమే కానీ, ఇంతవరకు సంచికలు చూడటం వీలుపడలేదు. మిత్రులు మణికొండ వేదకుమార్ ఈ పత్రిక ఎడిటర్‌గా నవంబర్ సంచిక పంపారు. ఈ పిల్లల వికాస పత్రిక 33 ఏళ్లుగా వస్తోందని చూడటం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.


గత నెల మిత్రులు వేదకుమార్ ఓపికగా, నేను ఓ సైన్స్ శీర్షిక తప్పనిసరిగా రాయాలని కోరితే, 2024 నవంబర్ సంచిక నుంచి నా ‘సైన్స్ వెన్నెల’ మొదలైంది. అయితే ఆ సంచిక బాలల దినోత్సవం సందర్భంగా చేతికందడం మరింత ఆనందం.

52 పేజీలు.. అన్ని పేజీలూ రంగుల్లో ఉన్నా కంటికి శ్రమ కలిగించని రీతిలో ముదురు రంగులు వాడడం ఇంకా ముచ్చటగా ఉంది. ఎన్నో అంశాలకు సంబంధించిన 40కి పైగా శీర్షికలు మహదానందాన్ని కలిగిస్తున్నాయి.

కనుక బాలబాలికలు ఈ పత్రికతో తప్పక చెలిమి చేసి ‘బాలచెలిమి’ తమదనే అంటారు!

– డా. నాగసూరి వేణుగోపాల్
m: 9440732392

# బొమ్మలేద్దామా...



చాహ్నా కృష్ణ
10 సంవత్సరాలు, 6వ తరగతి, జెనీవా, స్విట్జర్లాండ్

బాలచెలిమి క్లబ్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

పేరు : ____________________

తండ్రి పేరు : ____________________

పుట్టినతేదీ : ____________________

చిరునామా : ____________________

____________________

____________________

పిన్ : ____________________

హాబీలు : ____________________

మొబైల్ : ____________________

ఇ-మెయిల్ : ____________________

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com





# ప్రేమకు ప్రతిరూపం క్రిస్ట్‌మస్ పర్వదినం

**తేజ:** ఆమోస్ అన్నయ్య బాగున్నారా? ముందుగా మీకు క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు.

**ఆమోస్:** థాంక్యూ తేజ. గాడ్ బ్లెస్ యూ. బాగా చదువు తున్నావా?

**తేజ:** ఆ... బాగానే చదువుకున్నా... మా క్లాస్ టీచర్ మీ క్రిస్టమస్ పండుగ గురించి ఒక ప్రాజెక్ట్ వర్క్ ఇచ్చారు. దానిలో కొన్ని సందేహాలున్నాయి. అవి మీరే తీర్చగలరని మా తాతయ్య అన్నారు.

**ఆమోస్:** అయ్యో దానిదేముంది? నీ సందేహాలు ఏమిటో చెప్పు?

**తేజ:** లోకరక్షకుడైన యేసుక్రీస్తు పుట్టిన రోజునే మీరు క్రిస్టమస్ పండుగ చేసుకుంటారు కదా? అసలు యేసు ప్రభు ఎవరు? ఆయన దేవుడా? ఎందుకంత ప్రత్యేకత?

**ఆమోస్:** అసలు యేసుక్రీస్తు జన్మించిన నాటి కాల పరిస్థితులు వాటిని ఎలా చక్కదిద్దాడో తెలిస్తే ఆయన ఎవరు? ఎందుకు ఆరాధించబడుతున్నాడో అర్థం అవుతుంది.

**తేజ:** అయితే ఆ వివరాలు చెప్పు అన్నా!?

**ఆమోస్:** ప్రపంచంలోని అతి చిన్న దేశం అయిన 'ఇశ్రాయేలు' అనే దేశంలో 'యూదులు' రోమన్ చక్రవర్తుల పాలనలో ఉండేవారు. రోమన్‌లు లౌకిక వాదంలో ఉండగా యూదులు యూదా అనే మత పద్ధతులకు లోబడి ఉండేవారు. ఈ దేశంలో రెండు రకాల ప్రభుత్వాలు ఉండేవి. ఒకటి రోమా ప్రభుత్వం, మరొకటి స్థానికుల యూదా పాలన.

**తేజ:** అంటే మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాదిరి గానా?!

**ఆమోస్:** ఔను చక్కగా అర్థం చేసుకున్నావు. అయితే ఈ రెండు ప్రభుత్వాల మధ్య నిత్యం ఘర్షణలు. యుద్ధాలు జరుగుతూ ఉండేవి. ఆ ప్రాంతం అంతా రోముల ఆధీనంలో యూదులు అనేక కష్టాలు అనుభవించేవారు. ఇక సాధారణ నిరుపేద ప్రజలు దిక్కు మొక్కు లేక రెండు రాజ్యాల గొడవల్లో నలిగిపోయేవారు.

**తేజ:** మన దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు మన భారతీయులు పడ్డ కష్టాలు వారు పడ్డారన్న మాట.

**ఆమోస్:** ఇటువంటి అశాంతి వాతావరణంలో శాంతిని నెలకొల్పి తన బోధనల ద్వారా ఎందరినో ప్రభావితం చేసి తన బోధనలను ప్రచారం చేయడానికి శిష్యులను సమకూర్చుకుని ప్రేమ, క్షమా, గుణాల గొప్పదనాన్ని చాటిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, నాయకుడే యేసుక్రీస్తు.

**తేజ:** ఆ గొప్ప ఆధ్యాత్మిక నాయకుడు ఎక్కడ పుట్టాడు? అతని అమ్మానాన్నలు ఎవరు?

**ఆమోస్:** సుమారు రెండు వేల సంవత్సరాలు పూర్వం "యూదా" రాజ్యంలో బెత్లెహేము అనే చిన్న గ్రామంలో సంచార జీవనంలో గల యేసేపు – మరియలకు పశువుల పాకలో దేవుని కుమారునిగా మానవ రూపంలో డిశంబరు 25వ తేది వేకువ రాత్రి యేసుక్రీస్తు జన్మించాడు.




**తేజ:** యేసుక్రీస్తు పుట్టుకకు సంబంధించిన చారిత్రక ఆధారాలు ఉన్నాయా?

**ఆమోస్:** శాసనాల వంటి ఆధారాలు లేకపోయినా విశ్వాసుల మతగ్రంథాలైన పాత నిబంధన, కొత్త నిబంధన, బైబిలులోని వ్రాతలు ఈ విషయాన్ని వివరిస్తున్నాయి.

**తేజ:** మన చరిత్రకారులు కూడా క్రీస్తుపూర్వం క్రీస్తు తరువాతగా కాలాన్ని విభజించి వ్రాస్తారు కదా?

**ఆమోస్:** అవును చక్కగా చెప్పావు. ఇక యేసుక్రీస్తు తను జీవించిన 33 సంవత్సరాల కాలం బ్రహ్మచారిగా ఉండి తన యావత్ జీవితాన్ని నిరుపేదలు, అభాగ్యులు, హింసలకు బలైపోతున్న వారి పక్షాన నిలిచి తన బోధనలు మహిమలు ద్వారా నాటి రోమన్ రాజ్యాన్ని శాంతి సత్యం ధర్మం వైపు నడిపించే ప్రయత్నం చేసాడు.

**తేజ:** చివరకు తను అనుకున్న లక్ష్యం సాధించాడా అన్నా?!

**ఆమోస్:** సామాన్య ప్రజలు అతణ్ణి దేవుని రూపంగా గౌరవించి అతన్ని అనుసరించారు కాని నాటి రోమన్ పాలకులు అతడిని దేశద్రోహిగా భావించి యూదుల సాయంతో బంధించి రోమను శిక్షా విధానం ప్రకారం "శిలువ" వేసి చంపి అక్కడి భౌతిక దేహాన్ని "యెరూషలేము" పట్టణంలోని తోటలో శుక్రవారం నాడు ఖననం చేశారు.

**తేజ:** అయ్యో లక్ష్యం నెరవేరకుండానే చనిపోయాడే!?

**ఆమోస్:** ఆయన మరణం తర్వాతే ఆయన లక్ష్యం నెరవేరింది. ఖననం చేయబడిన చోట నుండి మూడవ రోజు ఆదివారం నాడు అతడి పార్థివ దేహం అదృశ్యం అయ్యింది. అది కేవలం దేవుని మహిమగానే భావించిన నాటి పాలకులు, ప్రజలు యేసు ప్రభువును దేవుని రూపంగా ఆరాధిస్తూ ఆయన చెప్పిన మార్గాన్ని ఆచరిస్తూ ఆ బోధనలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేస్తూ శాంతి కోసం ఆరాధనలు చేయడానికి చర్చిలను నిర్మించి మరణంతోనే మహితాత్ముడైన యేసు మరణ కారకమైన శిలువనే మత చిహ్నంగా భావిస్తూ క్రీస్తు బోధనలు నమ్మేవారంతా క్రైస్తవులుగా పిలువ బడుతున్నారు.

**తేజ:** అయితే ప్రేమకు – శాంతికి ప్రతిరూపమే క్రిస్మస్ పండుగ అన్నమాట!!

**ఆమోస్:** అంతే కాదు. అనాథలకు, పేదలకు సేవ చేయడమే క్రిస్మస్ పండుగలోని అంతరార్థం, యేసయ్యకు ఇష్టమైన పనులు అవి.

**తేజ:** ఆమోసన్నా యేసుక్రీస్తు చెప్పిన శాంతి మార్గం పాటించే వారు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు కదా? అందరూ డిశంబరు 25నే ఈ పండుగ చేసుకుంటారా?

**ఆమోస్:** వివిధ దేశాలలో వారి వారి కాలాల ప్రకారం తేదీలు మార్చి పండుగలు చేసుకున్నా కరుణామయుడైన ప్రేమమూర్తి భూమి మీదకు మానవ రూపంలో వచ్చిన రోజే క్రిస్మస్ పండుగ.

**తేజ:** క్రిస్మస్‌కు నెల రోజులు ముందు నుంచే ఇంటి ముందు నక్షత్ర ఆకారాలు వేలాడదీస్తారు ఎందుకు అన్నయ్యా?

**ఆమోస్:** క్రీస్తు పుట్టుక సందర్భంగా ఆకాశం నుంచి ఒక పెద్ద నక్షత్రం తూర్పు దిక్కు నుంచి క్రీస్తు పుట్టిన పశువుల పాకవైపు వచ్చిందని బైబిల్‌లో వ్రాయబడింది, దానికి గుర్తుగానే ఆ వేలాడే స్టార్లు, బహుమతులు పంచే క్రిస్మస్ తాతలు, క్రిస్మస్ ట్రీలు ఇవి అన్నీ నేటి కాలంలో వచ్చిన ఆధునిక ఆర్భాటాలే!!

**తేజ:** మరి మీరు ప్రతిరోజు చేసే ప్రార్థనలకు పండగ రోజు చేసే ప్రార్థనలకు తేడా ఏమైనా ఉంటుందా?!


**ఆమోస్:** ఎప్పుడు చేసినా ప్రార్థనల సారం అంతరార్థం ఒకటే. ప్రభువు రాకడను గుర్తు చేస్తూ ముందు రోజు రాత్రి చర్చిలలో ఆయనకు ఆహ్వానంగా కీర్తనలు పాడుతూ ప్రార్థనలు చేస్తాము. పండగ రోజు కూడా ఆయన భూమికి వచ్చినందుకు ఆనందంగా నూతన వస్త్రాలు ధరించి మిఠాయిలు పంచుతూ పేదలకు దానధర్మాలు చేస్తూ క్రీస్తు బోధనలు, మహిమలు గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడుపుతాము.

**తేజ:** థాంక్యూ అన్నయ్య నా సందేహాలు తీర్చడమే కాదు బోలెడు కొత్త విషయాలు చెప్పావు.

– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883222

జంతువు

# కంగారు



ఇది ఆస్ట్రేలియా జంతువు.

1770 వరకు ఈ జంతువు విషయం ప్రపంచానికే తెలియదు. ఆస్ట్రేలియా అడవులకు వెళ్ళిన 'కెప్టెన్ కుక్' అనే అతను మీటరున్నర ఎత్తు కలిగి, అందంగా, గమ్మత్తుగా కనిపించిన ఒక జంతువును చూసి దాని పేరేమిటో కనుక్కోవాలి అనుకున్నాడు. అక్కడి ప్రజలకు ఆ జంతువును చూపించి 'దాని పేరేమిటి?' అని అడిగాడు. వారు తమ భాషలో "నీకు ఎంత చెప్పినా ప్రయోజనం లేదు" అనే భావాన్ని "కంగారు" అంటారు. అదే మాట కెప్టెన్ కుక్కుకు చెప్పారు. జంతువు పేరే 'కంగారు' అనుకొని అతడు ఆ పేరు పెట్టాడు. అప్పటి నుండి 'కంగారు' పేరు ప్రచారంలోకి వచ్చింది.

**– నవంబర్ 1990,**

బాలచెలిమి మాసపత్రిక సంచిక నుండి....


చందదారులుగా చేరండి! బాలచెలిమి చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం॥లకు | : రూ. 750 |

*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

ఆరోగ్యం

# మంచి ఆహారపు అలవాట్లు



### సమతుల ఆహారం

సమతుల ఆహారం అంటే ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, క్రొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు, ఫైబర్ మొదలవైనవి. సరైన పాళ్ళలో ఉండే సమతుల ఆహారం తినాలి. సమతుల ఆహారం తీసుకోకుంటే రోగాలు వస్తాయి.

### ప్రోటీన్లు

ప్రోటీన్లు శరీరం యొక్క బిల్డింగ్ బ్లాక్స్ అని ఇవి శరీర పెరుగుదల, అభివృద్ధి కోసం అవసరమని అన్నారు. ముఖ్యంగా పిల్లలకు ప్రోటీన్ల అవసరం ఎక్కువ. అవి వారి వయస్సు, బరువును బట్టి మారుతాయి. ప్రోటీన్లు అమైనా ఆమ్లాలతో తయారవుతాయని, శరీర కణజాల పెరుగుదల, మరమ్మత్తు, పునరుత్పత్తి, ఎముకలు, కండరాలు, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రోటీన్లు ముఖ్యం.

### క్రొవ్వులు

శరీరం ప్రారంభంలో కార్బోహైడ్రేట్ల ద్వారా శక్తిని గ్రహిస్తుంది. మిగిలిన కార్బోహైడ్రేట్లు 20 నిమిషాల కంటే ఎక్కువ సమయం నిల్వచేయబడవు. అప్పుడు శరీరం శక్తిని క్రొవ్వులను నుండి గ్రహిస్తుంది. ఎ, డి, ఈ, కె అనే క్రొవ్వులో కరిగే విటమిన్లు శోషణలో క్రొవ్వులు ప్రధాన పాత్ర వహిస్తాయి. విటమిన్ల శోషణ క్రొవ్వులు లేకుండా సాధ్యపడదు. లినోలెనిక్ ఆమ్లం వంటి అత్యవసర క్రొవ్వు ఆమ్లాలు శరీరంలో సంశ్లేషణ కావు. ఇవి బయట నుండి అందాల్సిందే. ఇది సాధారణ శారీరక విధుల నిర్వహణలో చాలా ముఖ్యమైనవి. మెదడు పెరుగుదల, అభివృద్ధికి ఇవి అవసరం.

### విటమిన్లు

ఈ విటమిన్లు తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, నారింజ, నిమ్మకాయ, క్యారట్, బ్రోకలీ, మిరియాలు, పాల ఉత్పత్తులు, చేపలు, తృణధాన్యాలు, మాంసం వంటి ఆహార పదార్థాల్లో ఉంటాయి. జుట్టు, చర్మం కోసం, ముఖం కోసం "ఈ" & "సి" విటమిన్లు మంచివి. వ్యాధులను ఎదుర్కోవటంలో ఎముకల బలం కోసం కూడా మంచివి. బరువు తగ్గడంలో విటమిన్ "డి". కంటి కోసం విటమిన్ "ఎ", దంతాల నిర్మాణం, ఎముకల బలం, ధృఢత్వం, కండరాల పని తీరును, దంతక్షయం, రక్తం ఏర్పాటు, ఎంజైముల పని తీరు నిర్వహించడానికి ఖనిజ లవణాలు అవసరం.

### ఫైబర్ (పీచు పదార్థాలు)

ఫైబర్ ఒక రకమైన కార్బోహైడ్రేట్, ఇది రోజుకు 25 నుండి 35 గ్రాములు అవసరం. నీటిలో కరిగే ఫైబర్. నీటిలో కరగని ఫైబర్ అని రెండు రకాలు. నీటిలో కరిగేది గ్లూకోజ్, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. నీటిలో కరగనిది ఆహారాన్ని పేగులలో సులభంగా కదిలేటట్లు చూస్తుంది. మొక్కల నుండి సెల్యులోస్, హెమి సెల్యులోస్, లిగ్నిన్, బీటా గ్లూకాన్స్, గ్వార్‌గాయ్. పెక్టిన్లు, రెసిస్టెంట్ స్టార్చ్ మొదలలైనవి ఇవి మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. బలవర్ధకమైన ఆహారం వల్ల ధృఢమైన మన సంకల్పం ఏర్పడి ఉక్కు శరీరం తయారవుతుంది. స్వామి వివేకానంద యువతలో కోరుకున్నది ఇదే.

### ఫాస్ట్‌పుడ్, శీతల పానీయాలకు దూరంగా ఉండండి

ఫాస్ట్‌పుడ్ నోటికి రుచి కలిగించినప్పటికి శరీరానికి చాలా హానికరమైనది. ఇది అపరిశుభ్రమైనది. ట్రాన్స్‌ఫ్యాట్స్ వంటి హానికరమైన కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి. శీతల పానీయాల్లో అధిక చక్కెర ఉంటుంది. ఇది ఊబకాయం, మధుమేహం, దంత క్షయాలను కలిగిస్తుంది. శీతల పానీయాలకు బదులుగా గ్లాసు మజ్జిగ లేదా నిమ్మరసంతో రిఫ్రెష్ కావాలి. నారింజ, నిమ్మ, తులసి, పుదీనా మొక్కల ఆకు ముక్కలను కొన్ని గంటల పాటు నీటిలో ఉంచి తాగాలి ఇవి నీటిని ఆల్కలీన్‌గా మారుస్తాయి.

– బాల సారస్వతం (ఆరోగ్యం – విజ్ఞానం)

కథ

# కథ చెప్పుకుందామా!




గ్రంథాలయాలు విజ్ఞానానికి రహదారులు. ఎన్నో సంవత్సరాలుగా చరిత్రకు మూలాధారమై, వారసత్వ సంపదకు నిలయాలై, సామాజిక చైతన్యానికి ప్రధాన వాహికగా గణనీయమైనపాత్రను పోషిస్తున్నవి. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో గ్రంథాలయాలు ప్రజలందరిలో జాతీయ భావాలను పెంపొందించడంలో తోడ్పడిన తీరు అందరికీ తెలిసినదే. వివిధ గ్రంథాలు, విలువైన ఎన్నో సమాచార ఆధారాలకు నిలయమైన గ్రంథాలయం బాలలు, పెద్దలు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు పాఠకులెవరైనా గాని అందరినీ అక్కున చేర్చుకునే విభిన్న పుస్తకాల విశేషమైన నిధి.

జాతీయస్థాయిలో గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి ప్రధాన భూమిక పోషించిన నవంబర్ 14వ తేది నుండి నవంబర్ 20 వరకు ప్రతి సంవత్సరం వారం రోజుల పాటు దేశవ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోంది. ఈ వారోత్సవాలలో భాగంగా పుస్తక పఠనం పట్ల ప్రజలందరికీ చైతన్యం కలిగించడం, గ్రంథాలయాలను అందంగా అలంకరించడం, వివిధ గ్రంథాలను ప్రచారం చేయడం, కొత్త కొత్త పుస్తకాలను సేకరించడం, పుస్తకాలను విరాళంగా ఇవ్వడం, బాలబాలికలకు, పౌరులకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే రకరకాల సాంస్కృతిక పోటీలు మొదలగు ఎన్నో కార్యక్రమాలను నిర్వహించడం వివిధ గ్రంథాలయ సంస్థలు చేస్తుంటాయి. ఇటువంటి గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నవంబర్ 19వ తేదీన బాలచెలిమి మరియు తెలంగాణ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం సంయుక్తంగా అఫ్జల్ గంజ్ లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో ‘ పిల్లల గ్రంథాలయాలు వాటి ఆవశ్యకత ‘ శీర్షికతో నిర్వహించిన సదస్సు ప్రత్యేకమైనది. హైదరాబాద్, హిమాయత్ నగర్ లోని ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ సహకారంతో వేద కుమార్ గారి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సుమారు 200 కు పైగా బాలలు, బాల సాహితీవేత్తలు, బాలల ప్రేమికులు భాగస్వామ్యులయ్యారు.

‘పుస్తకం హస్తభూషణం’ అన్నారు పెద్దలు. వ్యక్తి జీవితంలో అటువంటి పుస్తకాల ఆవశ్యకత గురించి, పుస్తకాలకు నిలయాలైన గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి ముఖ్యంగా బాలలకు అవగాహన పరచటం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. బాలల శ్రేయస్సే జీవిత పరమావధిగా తలచే చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

అధ్యక్షులు, బాలచెలిమి మాసపత్రిక సంపాదకులైన మణికొండ వేద కుమార్ గారు బాలల కోసం ఎన్నో చోట్ల గ్రంథాలయాలను స్థాపించడం ఎంతోమందికి తెలిసిన విషయం. బాలచెలిమి మాసపత్రిక ద్వారా బాలల సమగ్ర అభివృద్ధి కోసం వారు చేస్తున్న కృషి అసాధారణమైనది. ఒక రచయిత్రిగా, పిల్లలకు కథలు చెప్పడం,వారితో సృజనలు చేయించే బాలల నేస్తంగా వేద కుమార్ గారి ఆహ్వానం మేరకు నేను కూడా ఆ కార్యక్రమంలో పాలుపంచుకోగలిగాను. ఆ సందర్భంలో బాలలకు చెప్పిన కథను ఇప్పుడు బాలచెలిమి బుల్లి పాఠకులతో పంచుకుంటాను.

శారీరక, మానసిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మికంగా బాలలు ఎదగడానికి కథలు ఎంతగానో తోడ్పడతాయి. తద్వారా వారి సంపూర్ణ మూర్తిమత్వాభివృద్ధికి బాటలు వేస్తాయి . అటువంటి ఒక మంచి కథ 'అమ్మ భాష'. నా మిత్రుడు బాలల చందమామ పెండెం జగదీశ్వర్ రచించిన ఈ కథను ఇప్పుడు మీ అందరికీ చెప్తాను. వినండి మరి..

ఒకరోజు పొద్దు పొద్దున్నే అడవికి రాజు అయిన సింహం దగ్గరకు, మహామంత్రి నక్క వచ్చింది. రాజా! రాజా! అని పిలిచింది. సింహం కళ్ళు నలుపుకుంటూ మహామంత్రి నక్కా! తెల్లవారకముందే ఇటు దయ చేశావు ఏమిటి సంగతిని అడిగింది. ఏం చెప్పను మహారాజా! చుట్టుపక్కల ఉన్న అడవుల్లో జంతువులన్నీ ఆంగ్ల భాషను ధారాళంగా మాట్లాడుతున్నాయి. మన అడవిలోని జంతువులకు ఆంగ్ల భాష రాదాయే!! అది తలచుకుంటేనే నాకు చాలా బాధగా ఉంది. ఆంగ్లం మాట్లాడకపోతే మనం బావిలో కప్పల్లా బతకాల్సి వస్తుందని భయంగా ఉంది. అంచేత మన జంతువులన్నింటికీ ఆంగ్లం నేర్పిద్దాం ప్రభూ! అన్నది.

సింహానికి ఈ ఆలోచన కొత్తగా అనిపించింది. అవునా! మనం మిగతా జంతువులతో పోలిస్తే వెనుకబడి పోతామా? అలా జరగడానికి వీల్లేదు. చాలా మంచి విషయం చెప్పావు. మరి మన అడవిలోని జంతువులన్నింటికీ ఆంగ్లం నేర్పించడం ఎలా! అని అడిగింది. పథకమంతా సిద్ధం చేసి ఉంచాను రాజా! మనకు చెప్పకుండానే మన అడవిలోని మేధావి తోడేలు పక్క అడవికి వెళ్లి అక్కడ ఆంగ్ల భాషలు నేర్చుకొని వచ్చింది. ఆ తోడేలుతో మన అడవిలోని జంతువులన్నింటికీ ఆంగ్ల భాష నేర్చుకునేలా శిక్షణ ఇద్దాం. ఆ తర్వాత ప్రతి ఒక్కరూ ఆంగ్లంలోనే మాట్లాడాలి. ఒక్క తెలుగు పదం కూడా వినపడకూడదని చట్టాలు చేద్దాం. ఒకవేళ ఎవరైనా తెలుగులో మాట్లాడితే కఠిన శిక్షలకు గురికావలసి వస్తుందని హెచ్చరిద్దాం. అని తెలిపింది నక్క.

అనుకున్న ప్రకారం అడవిలోని జంతువులన్నింటికీ శిక్షణను ఇవ్వడం, చట్టాలు చేయడం, ఆజ్ఞలు జారీ చేయడం ఒక్కొక్కటిగా జరిగిపోయాయి.

అప్పట్నుంచి జంతువులన్నీ మారు మాట్లాడకుండా ఆంగ్లంలోనే సంభాషించుకోవడం మొదలుపెట్టాయి. నక్క రహస్యంగా అడమంతా తిరుగుతూ జంతువులన్నింటినీ గమనించసాగింది.

ఒకరోజు నక్క ఏనుగును, జింకను, కుందేలును తక్షణమే రాజుగారి ముందుకు హాజరు కావాలని ఆజ్ఞ జారీ చేసింది.

ఏనుగు, జింక, కుందేళ్లకు ఏమీ అర్థం కాలేదు. తామేం తప్పు చేశామో తెలియని అయోమయంలో పడ్డాయి. ఇక తప్పదని భయం భయంగా రాజు గారి ముందుకు వచ్చి నిలబడ్డాయి.

ఇక అప్పుడు నక్క రాజా! ఈ మూడు జంతువులు మనం చేసిన నియమాలను ఉల్లంఘించాయి. తమరు తప్పకుండా ఈ మూడింటిని కఠినంగా శిక్షించాలని ఆ జంతువుల వైపు కోపంగా చూసింది.

అప్పుడు సింహం మహామంత్రి నక్కా! అసలు ఈ జంతువులు చేసిన తప్పేమిటి? అని ప్రశ్నించింది.

అయ్యయ్యో! మహారాజా! మొన్నటికి మొన్న ఈ ఏనుగు వాగులో నీళ్లు తాగడానికి వెళ్లి జారిపడింది. ఆ సమయంలో 'అయ్యబాబోయ్!' అంది.

"ఓ మై గాడ్" అనాలి కదా! నిన్న ఈ జింక చిరుతపులి తన వెంట పడుతుంటే 'రక్షించండి! కాపాడండి!'అని అరిచింది." ప్లీజ్ సేవ్ మీ" అనాలి కదా! ఇంక ఈ కుందేలు గురించి ఏమని చెప్పను? ఈరోజు ఉదయం పూట సూర్యోదయాన్ని చూస్తూ "వాట్ ఏ బ్యూటిఫుల్ సీనరీ!" అనకుండా 'అబ్బ ఎంత అందమైన దృశ్యం 'అంది. ఎంత ధైర్యం వీటికి. మన చట్టాన్ని అతిక్రమిస్తాయా! గర్వంగా అన్నది నక్క.

అంతే సింహం ఏదో మాట్లాడబోయేటంతలో ఏనుగు శరవేగంగా నక్క వద్దకు వచ్చి నక్కని తన తొండంతో గిరగిరా తిప్పి గట్టిగా నేలకేసి కొట్టింది. " వామ్మో! వాయ్యో! సచ్చినరా దేవుడా! " అంటూ గట్టిగా అరిచింది.

అది చూసిన సింహం "ఏయ్ ఏనుగు! నువ్వేం చేసావో నీకు తెలుస్తోందా? ఎంత ధైర్యం నీకు? మహామంత్రి నక్కని నేల కేసు కొడతావా?" అని కోపంగా అంది.

అందుకు ఏనుగు మహారాజా! ఇట్లా చేయవలసి వచ్చినందుకు నన్ను క్షమించండి. తెలుగు మన అమ్మ భాష. మన నరనరాల్లో జీర్ణించుకుపోయింది. ఎన్ని భాషలు నేర్చుకున్నా సహజంగా మనకు అలబడ్డ భాష మాతృభాష ఆనందంలోనూ, బాధలోనూ అప్రయత్నంగా వ్యక్తమవుతుంది. ఇతరత్రా ఎన్ని భాషలు నేర్చుకున్నా అవన్నీ అదనపు భాషలే కానీ అమ్మ భాషకు సాటి రావు. అమ్మ భాష సహజసిద్ధం కాదని ఇప్పటికి కూడా మీరు భావిస్తే మాతోపాటు మంత్రి నక్క గారిని కూడా శిక్షించాలి. అంటూ వినయంగా నిలబడింది.

ఒకవైపు ఒళ్ళు హూనమై మరొకవైపు సిగ్గుతో చితికిపోయిన నక్క తల పైకెత్తి చూడలేకపోయింది. సింహం కొన్ని క్షణాలు ఆలోచించి " ఈ చట్టాన్ని రద్దు చేస్తున్నాను". అంతేకాదు నిత్యజీవితంలో ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా అమ్మ భాషలోనే మాట్లాడాలనే కొత్త చట్టాన్ని ప్రవేశపెడుతున్నాను. ఆంగ్లం ఒక్కటే కాదు, మన అడవిలోని జంతువులన్నీ ఎన్ని భాషలయినా నిరభ్యంతరంగా నేర్చుకోవచ్చు. అమ్మ భాషను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు, ఏనుగూ! జింకా! కుందేలూ !మీ ముగ్గురు ఇక్కడ నుండి వెళ్ళిపోవచ్చు. మీకు ఎటువంటి శిక్షలను నేను అమలు చేయడం లేదు. అని పలకడంతో అవి సంతోషంగా ముందుకు కదిలాయి.

బాలలూ! కథ బాగుంది కదూ! ఇది కథ మాత్రమే కాదు, నేడు మనందరి ముందున్న కర్తవ్యం. మనందరం తప్పకుండా ఆచరించాల్సిన విషయం. ఆచరిస్తారు కదూ..

బాలసాహితీవేత్త పెండెం జగదీశ్వర్ రచించిన ఇంత మంచి కథను స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో ఎంతోమంది బాలలకు చెప్పే అవకాశాన్ని అందించిన మణికొండ వేదకుమార్ గారికి, లైబ్రరీ చీఫ్ రాణి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

– డాక్టర్ ఉప్పల పద్మ
m : 9959126682

## బొమ్మలేద్దామా...



చాహ్నా కృష్ణ
10 సంవత్సరాలు, 6వ తరగతి, జెనీవా, స్విట్జర్లాండ్



# కలంచెలిమి



**జి. దుర్గ ప్రియ**

9వ తరగతి

బాలికల ఉన్నత పాఠశాల

గంభీరావుపేట, రాజన్న సిరిసిల్ల.



**డి. చందన**

10వ తరగతి,

అన్నవరం గ్రామం,

పాన్గల్, వనపర్తి జిల్లా

**జి. రత్నమేఘ**

9వ తరగతి ఇంగ్లీష్ మీడియం,

అరవింద్ హై స్కూల్,

తాడెపల్లి, గుంటూరు.



**పి. తనూజ**

7వ తరగతి

జిహెచ్ఎస్ మసూమల్లి,

వరంగల్





**సిహెచ్. అనూష**

10 తరగతి,

జెడిపిహెచ్ఎస్, చిన్న మాదారం

కనగల్లు, నల్గొండ.



**బి. భావన**

7వ తరగతి 'బి'

జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,

పూడూర్, వికారాబాద్.



# బాలలం - పూవులం

బాలలం మేం పూవులం
భావితరానికి బాటలం

అమ్మానాన్నలు మా దైవం
గురువుల మాటలు మాకిష్టం
మా బడియే మా భవితవ్యం
మా స్నేహితులే మా ప్రాణం

చదువులు చక్కగా చదవాలి
విలువల విద్యను నేర్వాలి
నింగికి నిచ్చెన వేయాలి
పెద్దల మన్నన పొందాలి

మానవత్వమే మా మతం
పరోపకారమే మా కులం
సమాజ సేవే మా సంకల్పం
దేశ ప్రగతియే మా ధ్యేయం

- డా. నమిలకొండ సునీత
m : 9908468171



# కాళ్ళాగజ్జా కంకాళమ్మా

కాళ్ళాగజ్జా కంకాళమ్మా
వేగుచుక్కా వెలగా మొగ్గా
మొగ్గా కాదు మోటా నీరు
నీరు కాదు నిమ్మల బావి
బావి కాదు బచ్చల కూర
కూరగాదు గుమ్మడి పండు
పండూగాదు పాప కాలు
కాలు తీసి కడగాబెట్టూ!

పిల్లలకు ఆటలు పాటలు
పుస్తకం నుండి





# పర్యావరణం & జీవవైవిధ్యం

ప్ర : భారతదేశపు మొట్టమొదటి స్లాత్ బేర్ రెస్క్యూ సెంటర్ ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : కర్ణాటక**

ప్ర : 'సెన్నా స్పెక్టబిలిస్' అంటే ఏమిటి?

**జ : ఇన్వాసివ్ ప్లాంట్**

ప్ర : అట్పాడి కన్జర్వేషన్ రిజర్వ్ ఏ రాష్ట్రానికి చెందిన కొత్త పరిరక్షణ రిజర్వ్?

**జ : మహారాష్ట్ర**

ప్ర : ఏ రక్షిత ప్రాంతంలో అంతరించిపోతున్న "హాగ్ డీర్" మొదటిసారిగా కనిపించింది?

**జ : రాజాజీ టైగర్ రిజర్వ్**

ప్ర : ఉదంతి సీతానది టైగర్ రిజర్వ్ ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : ఛత్తీస్‌గఢ్**

ప్ర : భారతదేశంలో వాయు కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ఏ సంస్థ సమగ్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది?

**జ : ప్రపంచ బ్యాంక్**

ప్ర : UNICEF జనరేషన్ అన్‌లిమిటెడ్ COP 28 వద్ద ఏ దేశం సహకారంతో "గ్రీన్ రైజింగ్" కార్యక్రమాన్ని ప్రారంభించింది?

**జ : భారతదేశం**

ప్ర : 'ఇంపేషన్స్ కరుప్పుసామి' ఏ జాతికి చెందినది?

**జ : మొక్క**

ప్ర : ఓరియంటియా సుట్సుగముషి బ్యాక్టీరియా వల్ల ఏ వ్యాధి వస్తుంది?

**జ : స్క్రబ్ టైఫస్**

ప్ర : భితార్కనికా నేషనల్ పార్క్ ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : ఒడిషా**



ప్ర : సుల్తాన్‌పూర్ పక్షుల అభయారణ్యం ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : హర్యానా**

ప్ర : కాంగర్ వ్యాలీ నేషనల్ పార్క్ ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : ఛత్తీస్‌గఢ్**

ప్ర : బేట్ ద్వీపం ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : గుజరాత్**

ప్ర : కృష్ణరాజ సాగర రిజర్వాయర్ ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : కర్ణాటక**

ప్ర : ఏ రాష్ట్రంలో చెట్ల పెంపకం కోసం 500కి పైగా ల్యాండ్ పార్శిల్స్‌తో గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్?

**జ : మధ్యప్రదేశ్**

ప్ర : పశ్చిమ బెంగాల్‌లోని టైగర్ హిల్ ఏ వన్యప్రాణుల అభయారణ్యంలో భాగం?

**జ : సెంచల్ వన్యప్రాణుల అభయారణ్యం**

ప్ర : కాలుష్యం కారణంగా కనిపిస్తున్న నోయల్ నది ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : తమిళనాడు**

ప్ర : రిటాకుబా బ్లాంకో హిమానీనదం ఏ దేశంలో ఉంది?

**జ : కొలంబియా**

ప్ర : నెరియం ఒలియాండర్ అంటే ఏమిటి?

**జ : సతత హరిత పొద**

ప్ర : కిషన్‌గంగ, ఏ నదికి ఉపనది?

**జ : జీలం**

ప్ర : మైక్రోప్లాస్టిక్ కాలుష్యంగా కనిపిస్తున్న అష్టముడి సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?

**జ : కేరళ**

– సచిన్ కోత్వాల్

బాలచెలిమి

# వైభవంగా బాలల సాంస్కృతికోత్సవం...





విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడం ద్వారా ఉత్తమ సమాజం నిర్మాణం అవుతుందని అందుకుగాను తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల కోసం నిర్వహిస్తున్న అనేక సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని కోదూరి శాంతా వసంత ట్రస్ట్ అధ్యక్షులు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వరప్రసాద్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 15వ తారీఖున దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన బాలల సాంస్కృతిక ఉత్సవానికి విశిష్ట అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు.

యాంత్రికత పెరిగిపోతున్న నేటి సమాజంలో బాలలే రేపటి దేశ భవిష్యత్తని, వారే మన బలం, బలగం. వారిలో సృజనాత్మకత పెంపొందించెందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కోదూరు శాంతమ్మ స్మారకార్థం బాలల సాంస్కృతి కోత్సవం ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్నో అరుదైన దృశ్యాలు చోటు చేసుకున్నాయి. 6 నుండి 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల కోసం పాటల పోటీలు, కథలు కవితలు, ఏకపాత్రాభినయం, వ్యాసరచన, ఉపన్యాస పోటీ, పుస్తక సమీక్ష, సంగీతం, నృత్య, నాటక కళా పరిచయాల వంటి అనేక కార్యక్రమాలలో ఎంట్రీలు నిర్వహించడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుండి దాదాపు 102 పాఠశాలల నుండి 1200 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. కథల పోటీలలో 372, కవితలు 215, చిత్రలేఖనం 518, విద్యార్థులు, వ్యాస రచనలో 180 మంది పాల్గొనడం గొప్ప విశేషం.

వివిధ అంశాలలో పాల్గొన్న సుమారు 80 మందికి పైగా బాల బాలికలకు జ్ఞాపికలు, పుస్తకాలు, సర్టిఫికెట్స్ నగదుతో బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సారస్వత పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు కె.వి రమణాచారి విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడారు. సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె, చెన్నయ్య ప్రారంభంలో స్వాగతోపన్యాసం చేశారు. బాల ప్రతిభావంతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

సమన్వయకర్తగా గరిపెల్లి అశోక్ వ్యవహరించిన ఈ కార్యక్రమంలో బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్, చొక్కాపు వెంకటరమణ, దాసరి వెంకట రమణ, పైడిమర్రి రామకృష్ణ, వేదాంత సూరి, సి ఏ ప్రసాద్, అమరవాది నీరజలతో పాటు ఎంతో మంది బాల సాహితీవేత్తలు పాల్గొన్నారు.

**– తెలంగాణ సారస్వత పరిషత్,**
హైదరాబాద్

## యువశ్రీ మురళి సంపాదకత్వంలో బాల నేస్తాలు పుస్తకావిష్కరణ...



అక్టోబరు 29 మంగళవారం మండలంలోని స్థానిక కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అధ్యక్షతన పాఠశాల తెలుగు పండితులు, రచయిత యువశ్రీ మురళి సంపాదకత్వంలో ప్రచురించిన కల్లివెట్టు బడి పిల్లల కథా సంకలనం 'బాల నేస్తాలు' మండల విద్యాశాఖ అధికారులు ఆవిష్కరించి.. తొలి ప్రతిని బాల సాహితీవేత్త కృష్ణ స్వామి రాజుకి అందించారు. కృష్ణ స్వామి రాజు మాట్లాడుతూ భవిష్యత్తుకు భాషా వారసులు ఈ బాల రచయితలని అన్నారు. కథలు రాసిన విద్యార్థులను శతావధాని ఆముదాల మురళి శాలువా, పుస్తకంతో సత్కరించారు.

## బాలల్లో సౌహార్ధత స్నేహాన్ని పెంచాలి



బాలల దినోత్సవం జరపడంలో భాగంగా సాహిత్య, సాంస్కృతిక, క్రీడా మొదలైన రంగాల్లో పోటీలు నిర్వహించడం వల్ల బాలల మధ్య 'క్రీడా స్ఫూర్తి' అయిన ఓటమిల నుంచి నిలదొక్కుకొని అనంతర కాలంలో పాల్గొనే పోటీల్లో మరింత మెరుగైన రీతిగా పాల్గొనే తత్వం అలబడుతుంది. ఇంకా బాలబాలికల్లో స్నేహభావం పెంపొందుతుందని ఆచార్య అలేఖ్య పుంజాల అన్నారు. బాలల దినోత్సవం-2024 తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ సంయుక్తంగా తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నవంబరు 14 ఉదయం 10 గంటలకు నిర్వహించినది. ఈ సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల విచ్చేసి విద్యార్థులలో స్ఫూర్తినింపే ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం రాసిన లోక కవి అందెశ్రీ ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరయ్యి భారత తొలి ప్రధాని పండిత జవహర్ లాల్ నెహ్రూకు పిల్లలంటే అమితమైన ఇష్టమని ఎంతో ప్రేమని చెప్తూ భవిష్యత్తులో పెద్దయ్యాక ఏ వృత్తి చేపట్టినా అందులో రాణించాలని అన్నారు. అధ్యక్షత వహించిన సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి ప్రసంగిస్తూ పిల్లలు బాల్యం నుంచే సాహిత్య పఠనం, సృజన అలవర్చుకోవాలన్నారు. బాలల కథానిక, కవిత్వం, వ్యాసరచన పోటీలకు సంబంధించిన నేపథ్యం తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ కార్యదర్శి శ్రీ మనోహర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి సుమారు 300 మంది పిల్లలు పాల్గొన్నారు. పిల్లల ఆటపాటలతో గ్రూప్ డాన్స్‌లతో హాలంతా మార్మోగింది ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా పూర్ణ చంద్ర ప్రదర్శించిన మ్యాజిక్ షో పిల్లలందరిని అలరించింది. ఈ సందర్భంగా సాహిత్య అకాడమీ బాలల కొరకు కథానిక, వ్యాసము, కవిత్వంపై పోటీ నిర్వహించింది. తెలంగాణ సాహిత్య అకాడమీ ఇలా పిల్లలకు సాహిత్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం ఇదే తొలిసారి. ఈ పోటీలో పాల్గొని గెలుపొందిన బాల బాలికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రతి అంశంలో ముగ్గురు చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరిగింది. ఏకపాత్రాభినయం, పాటలు పాడడం, నృత్యం చేయడంలలో పోటీ నిర్వహించడం జరిగింది ఈ పోటీల్లో గెలుపొందిన బాలబాలికలందరికీ నగదు బహుమతి తో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. పిల్లలందరూ స్టేజి పైకి వచ్చి హుషారుగా గ్రూప్ డాన్స్ చేయటం అందరిని అలరించింది

## ఏడురంగుల జెండాకు ప్రత్యేక పురస్కారం



నవంబర్ 3వ తేదీన వేముల వాడ పట్టణంలోని ఈశ్వరి గారి ముక్తేశ్వరి ఫౌండేషన్, సాంఘిక, సామాజిక, సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో 2024

సంవత్సరపు సాహితీపురస్కార కార్యక్రమం జరిగింది. కథల సంపుటి విభాగంలో డా. అమరవాది నీరజ రచించిన ఏడురంగుల జెండాకు ప్రత్యేక పురస్కారం లభించింది. రచయితను శాలువా, జ్ఞాపిక, నగదు బహుమతులతో సత్కరించారు. మంగారి రాజేందర్, బి.ఎస్. రాములు, ఏనుగు నరసింహారెడ్డి, ఈశ్వరి గారి నరహరిశర్మ పాల్గొన్నారు.

## మాచిరాజు బాలసాహితీ పురస్కారాల ప్రదానం



'మాస్టర్ స్టోరీ టెల్లర్ చొక్కాపు వెంకటరమణ, కవి, బాల సాహితీవేత్త పత్తిపాక మోహన్‌కు మాచిరాజు సీతారామయ్య–రత్నకుమారి దంపతుల స్మారక బాలసాహిత్య పురస్కార ప్రదానం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. మాచిరాజు బాలసాహిత్య పీఠం, బాలసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ ప్రొ. మృణాళిని మాట్లాడారు. 'కథల చందమామ మాచిరాజు కామేశ్వరరావు తన తల్లిదండ్రుల స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ పురస్కార కార్యక్రమానికి కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత డా. దాసరి వెంకట రమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అతిథులుగా నాగసూరి వేణుగోపాల్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కన్నెగంటి అనసూయ, పైడిమర్రి రామకృష్ణ, సమ్మెట ఉమాదేవి, జొన్నలగడ్డ శ్యామల, చెకుముకి రాజా, చెరుకుపల్లి హారిక వంటి బాలసాహితీ వేత్తలు పాల్గొన్నారు. కాపర్తి నరేష్, వేణుగోపాల్, రమేష్, సాయితేజ మిమిక్రీ ప్రదర్శన ఆకట్టుకుంది...

## నిజామాబాద్‌లో బాలోత్సవం

జన విజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, మరియు పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 12 ,13 తేదీలలో నిజామాబాద్ బాలోత్సవం –చదువుల పండుగ, జిల్లాలోని మోపాల్ మండలం ప్రెసిడెన్సి పాఠశాలలో అంగరంగ వైభవంగా జరిగింది. మొదటి రోజున 15 వందల



మంది విద్యార్థులు, రెండవ రోజున 15 వందల మంది విద్యార్థులు మొత్తంగా 3,000 మంది విద్యార్థులు ఈ బాలోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి రోజు 6, 7 తరగతులకు సంబంధించిన విద్యార్థులకు, రెండవ రోజు 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్, చిత్రలేఖనం, చక్కటి దస్తూరి అనే అంశాలలో మరియు ఏకపాత్రాభినయం, స్కిట్, పాటలు, డాన్స్, పద్యాలాపన పోటీలు నిర్వహించారు. ఈ బాలోత్సవ ప్రారంభ సమావేశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం ప్రారంభించారు. సైన్స్ కార్నర్ గణిత కార్నర్, బ్లడ్ గ్రూప్ కార్నర్ లతోపాటుగా వివిధ వైజ్ఞానిక అంశాల ప్రదర్శనను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శించారు. దాదాపుగా 3,000 మంది విద్యార్థులు 35 మంది రిసోర్స్ పర్సన్స్ 30 మంది న్యాయ నిర్ణేతలు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వందల మంది ఇందులో పాల్గొన్నారు. బాలోత్సవ నిర్వహణ కమిటీ ప్రణాళిక బద్ధంగా, విజయవంతంగా ఈ బాలోత్సవాన్ని నిర్వహించింది. ఈ బాలోత్సవ కమిటీ బాధ్యులుగా రవీంద్రనాథ్ సూరి, నర్రా రామారావు, రామ్మోహన్ రావు ఈ బృహత్కార్యాన్ని ముందుండి నడిపించారు. రెండు రోజుల ఈ బాలోత్సవ ముగింపు సమావేశానికి నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు ఆర్. భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులు అందరినీ అభినందించి, నిర్వాహకుల కృషిని ప్రశంసించి, విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ బహుమతుల కింద విద్యార్థులకు జ్ఞాపిక సర్టిఫికెట్ మరియు ఒక మంచి బ్యాగును నిర్వాహకులు అందించారు. విద్యార్థులందరికీ ఎంతో ప్రేరణగా నిలిచి, ఎంతో ఉత్సాహాన్ని కలిగించిన ఈ బాలోత్సవం – చదువుల పండుగ ఓ గొప్ప స్ఫూర్తిని అందించి విజయవంతంగా ముగిసింది.

– బాలచెలిమి డెస్క్

# చుక్క సత్తయ్య

అపూర్వమైన జానపద సంస్కృతికి, అపారమైన వైవిధ్యం కలిగిన కళారూపాలకు ఆటపట్టయిన తెలంగాణలో జన్మించిన కళాకారులెందరో అటువంటి వాటలో చుక్క సత్తయ్య ప్రముఖంగా చెప్పుకోదగినవారు. ఒగ్గుకథ కళారూపానికి విశేషమైన గుర్తింపు తెచ్చిపెట్టిన ఈ కళామూర్తి పేరులో, వేషంలో తెలంగాణ కథాగేయాన్ని వివిధ గతుల్లో ఆలపించి అపూర్వమైన అనుభూతిని పంచి పెట్టడంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందారు.

1935 మార్చి 29న వరంగల్ జిల్లా మాణిక్యాపురంలో సత్తయ్య జన్మించారు. తల్లిదండ్రులు సాయమ్మ, ఆగయ్య, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వర్గంలో జన్మించిన సత్తయ్య వనాడు పాఠశాలకు వెళ్ళి విద్యను అభ్యసించలేదు. ఊరి పంతుళ్ళ దగ్గర తెలుగు రాయడం, చదవడం నేర్చుకున్నాడు. బాలశిక్ష శతకాలు చదువుకున్నాడు. చిన్నప్పుడే ఊళ్లో ప్రదర్శించే వీధి నాటికలు సత్తయ్యను విశేషంగా ఆకర్షించాయి. నాటకాల్లోని పాత్రధారులు ధరించే ఆభరణాలు, వస్త్రాలు, వారు చూపే అభినయం, ఆలపించే పాటలు, పద్యాలు సత్తయ్యను సమ్మోహితుడ్ని చేశాయి. ఎట్లాగైనా తానూ కళాకారుడు కావాలని కలలు గన్నాడు. కొంత తండ్రి ప్రోత్సాహం తోడైంది. రామాయణ, మహాభారత కథలు ఇతివృత్తాలుగా సాగే వీధి నాటికల్లో తానూ వివిధ రకాలైన పాత్రలను ధరించడం ప్రారంభించాడు. ఒగ్గు కథ కుర్మకులానికి సంబంధించిన కళారూపం.




కళాకారులు డోలు, తాళాలు, స్త్రీవేషం, కంతు మొదలైన హంగులతో ఆడిపాడుతూ అనేక రకాలైన కథల్ని గానం చేస్తారు. 1970కు ముందే తెలంగాణలో జానపద కళారూపాల ప్రదర్శనల్లో ఒగ్గుకథకు అగ్రతాంబూలం లభించడానికి కారణం సత్తయ్య. ఇతర రాష్ట్రాల వేదికలలో కూడా ఒగ్గుకథకు స్థానం కల్పించాడు. ఢిల్లీలోని జాతీయ సంగీత నాటక అకాడమీ అనేక మార్లు చుక్క సత్తయ్య ఒగ్గుకథ ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో, నాగపూర్‌లోని / దక్షిణ ప్రాంత సంస్కృతిక కేంద్రం, హంపీ విజయనగర దసరా ఉత్సవం, ప్రపంచ తెలుఅగు మహాసభలు, తిరువనంతపురం నిషాగంధి ఉత్సవం మొదలైన ప్రతిష్ఠాకరమైన సంస్థలు ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో చుక్క సత్తయ్య బృంద్ ఒగ్గుకథను ప్రదర్శించి తెలంగాణ జానపద కళా వైలక్ష్యాన్ని ఆయా భాషల వారికి రుచి చూపాయి. ఆకాశవాణి, దూరదర్శన్ ద్వారా గత 45 సంవత్సరాలుగా కొన్ని వందల సార్లు వీరి ఒగ్గుకథా గానం ప్రసారమై అసంఖ్యాకమైన శ్రోతలను ఆకట్టుకుంది. సత్తయ్యకు లభించిన గౌరవాలు కూడా అత్యున్నతమైనది. ప్రధానులు శ్రీమతి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధి, పి.వి. నర్సింహారావు, నీలం సంజీవరెడ్డి, ఎ.పి.జె. అబ్దుల్‌కలాం వంటి రాష్ట్రపతులు చుక్క సత్తయ్యను సత్కరించారు. ఎన్.టి.ఆర్.కు చుక్కసత్తయ్య అంటే ప్రత్యేకమైన గౌరవం.

ఆయన పేరు చౌదరిపల్లి సత్తయ్య, అయితే చుక్క సత్తయ్యగానే కళాలోకానికి సుపరిచితులు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిభా రాజీవ్ పురస్కారమందుకొన్నారు. శ్రీ డా. నేరెళ్ల వేణుమాధవ్ పురస్కారం పొందారు.

ఒక్క విషయం తప్పకుండా ప్రస్తావించాలి. అది 2005వ సంవత్సరం చుక్క సత్తయ్య గారికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చెయ్యాలని నిర్ణయించినట్లు తెలియజేస్తూ రెండు విశ్వవిద్యాలయాలు గవర్నరుకు ప్రతిపాదన పంపాయి. ఒకరికి రెండు డాక్టరేట్లు ఏకకాలంలో ఇవ్వడం జరగదు. సత్తయ్య జన్మస్థలం వరగల్లు జిల్లా కాబట్టి కాకతీయ విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ ప్రదాన్ చేసేందుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ఒకేసారి రెండు విశ్వవిద్యాలయాలు ఈ అత్యున్నతమైన గౌరవాన్ని ఆయనకు అందించాలని నిర్ణయించటం యాదృచ్ఛికమే అయినా గొప్ప శాస్త్రవేత్తతోనూ సమానంగా సత్తయ్యకు ఈ గౌరవం లభించడం సాధారణమైన విషయం కాదు. అప్పటి రాష్ట్రపతి డా.ఎ.పి.జె. అబ్దుల్‌కలాం చేతుల మీదుగా దక్కడం సామాన్యమైన విషయం కాదు. కేంద్ర సంగీత-నాటక అకాడమి అవార్డు పొందిన తెలంగాణ విద్వాంసులు, కళాకారులే తక్కువ. అందునా ఒక జానపద కళాకారునికి ఈ పురస్కారం లభించడం అరుదైన విషయ్ సత్తయ్యలోని ప్రతిభకు దక్కిన గౌరవమిది. ఏమైనా తెలంగాణలో జన్మించి స్వయంకృషితో సమున్నత కళాకారునిగా ఎదిగి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన రీతిలో గుర్తింపు పొందిన కళాకారుడు చుక్క సత్తయ్య, తెలంగాణ కళా వినీలాకాశంలో పల్లె ప్రతిభను ప్రతీకగా మెరిసే వేగు చుక్క ఈ చుక్క సత్తయ్య. ఆయనను చూసి తెలంగాణ గర్విస్తుంది. తెలంగాణ మట్టిలో జన్మించినందుకు తాను గర్విస్తాడు.

**– డా॥ కె. చెన్నయ్య**


CENTRAL
SINCE 1947
BOOKS
Your trusted Academic Partner - Then, Now & Forever
DIAMOND JUBILEE
CELEBRATING 75 YEARS OF
KNOWLEDGE, TRUST & LEADERSHIP
12 lakhs + Customers
700+ Schools
15 Business Awards
Online Services
Digital Learning
Books and Stationery Supplies
Head Office : 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282
Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.
Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.
www.centralbooks.in

**BALA CHELIMI,** Telugu Children's Monthly Magazine
Date of Publication - 28th November, 2024
Postal Dates: 24th & 26th Every Month

RNI Regn. No. 52828/1992 TC No. TEL Tel01232
Postal Regn.No.HCD-5022/2024-2026


# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com